'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 31 | సోమవారం | 14.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 31 | Monday | 14.9.2026 | Pages: 8 | Rate: 2



అందరికీ

విఘ్నాలు తొలగి..

విజయాలు చేకూరాలి!



గుండెబోయిన వెంకన్న

చీఫ్ ఎడిటర్



పాఠకులు, ఏజెంట్లు, ప్రకటన కర్తలు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు.

నేడు మా కార్యాలయానికి సెలవు.

కాబట్టి మంగళవారం సంచిక వెలువడదు.

పునర్దర్శనం బుధవారం.

- గుండెబోయిన వెంకన్న,

చీఫ్ ఎడిటర్

## వ్యాధి వచ్చాక కాదు.. ముందే మేల్కొందాం!

డయాలసిస్ బారిన పడకుండా కాపాడుకుందాం

క్రియాటినిన్ నార్మల్ అంటే కిడ్నీలు సేఫేనా?

జాగ్రత్తలతో ప్రాణాలు కాపాడుకునే ఫార్ములా?



కిడ్నీ వ్యాధి అంటే వెంటనే గుర్తొచ్చేది డయాలసిస్.. కానీ అసలు ప్రమాదం అక్కడ మొదలుకాదు. డయాలసిస్ అవసరం వచ్చే సమయానికి కిడ్నీ పనితీరు ఇప్పటికే చాలా తగ్గిపోయి ఉంటుంది. మరి అంతకుముందు? కిడ్నీలు అప్పటికే ఎన్నో సంకేతాలు ఇచ్చి ఉండొచ్చు. అవి మాత్రం చాలాసార్లు నొప్పి రూపంలో కనిపించవు. అందుకే "క్రియాటినిన్ నార్మల్‌గా ఉంది.. నాకు ఏమీ కాదు" అనే నిర్లక్ష్యం ప్రమాదకరంగా మారొచ్చు. ఈజీఎఫ్ఆర్, మూత్ర ఏసీఆర్ పరీక్షలు కిడ్నీ ఆరోగ్యంపై ముందస్తు చిత్రాన్ని చూపగలవు. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు, గుండె సమస్యలు ఉన్నవారికి అప్రమత్తత మరింత అవసరం. కిడ్నీని కాపాడే కొత్త చికిత్సా మార్గాలు అందుబాటులోకి వస్తున్న వేళ.. వ్యాధి చివరి దశ కోసం వేచి చూడటం ఎందుకు? అసలు మలుపు ఎక్కడుంది?

- వివరాలు 4లో...



# బ్రిక్స్‌లో భారత్ దౌత్య విజయం

## ఒకే వేదికపై మోదీ, పుతిన్, జిన్‌పింగ్

### మధ్యప్రాచ్యంపై ఏకాభిప్రాయం.. ఉగ్రవాదంపై కఠిన వైఖరి

న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రధాని నరేంద్ర మోదీ మధ్యలో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా ఇతర దేశాధినేతలు ఇరువైపులా నిలిచిన 'బ్రిక్స్ ఫ్యామిలీ ఫొటో' ప్రత్యేక ఆకర్షణగా మారింది. భారత్, చైనా, రష్యా, ఇరాన్ సహా 11 దేశాల నేతలు ఒకే వేదికపైకి రావడం అంతర్జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో అగ్రదేశాల నేతలు కలిసి చర్చలు జరపడం బ్రిక్స్ ప్రాధాన్యతను మరోసారి చాటింది.

- వివరాలు 4లో...



## యుద్ధం వద్దు.. శాంతి ముద్దు

ఇరాన్-యూఏఈ మధ్య కొత్త దౌత్యం

గల్ఫ్ దేశాల్లో మారుతున్న వైఖరి

భారత్ వేదికగా శాంతి సంకేతాలు



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్, యూఏఈ మధ్య దౌత్య సంబంధాల్లో కీలక మార్పు కనిపించింది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా న్యూ ఢిల్లీలో యూఏఈ అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్ బిన్ జాయెద్‌తో భేటీ అయిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్.. మరుసటి రోజు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్-యూఏఈ మధ్య చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని, గతాన్ని పక్కన పెట్టి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలనే అంగీకారం కుదిరిందని ఆయన తెలిపారు.

- వివరాలు 4లో...

## భళా మోదీ

బ్రిక్స్ వేదికగా ఇండియా దౌత్య విజయం

రక్షణ భాగస్వామ్యాలకు కొత్త బలం

ఆసియా, ఆఫ్రికాతో వ్యూహాత్మక బంధం



న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ వరుస ద్వైపాక్షిక సమావేశాలతో భారత్ వ్యూహాత్మక దౌత్యాన్ని విస్తరించారు. రక్షణ,భద్రతా సహకా రానికి ఈ భేటీల్లో ప్రధాన ప్రాధాన్యం లభించింది.

- వివరాలు 3లో...

## కేటీఆర్ సిబ్బందికి నోటీసులు

పండుగ రోజే విచారణకు పిలుపు

హైకోర్టు ఆదేశాలతో ఘటనపై కేసు



బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పీఏ మహేం దర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్‌కు సైఫాబాద్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 7న అసెంబ్లీ గేట్ నంబర్ 3 వద్ద జరిగిన ఘటనకు సంబంధించి నమోదైన కేసులో ఇద్దరినీ విచారణకు పిలిచారు. సోమవారం ఉదయం 10 గంటలకు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో హాజరై దర్యాప్తునకు సహకరించాలని నోటీసుల్లో స్పష్టం చేశారు.

- వివరాలు 2లో...

## రేవంత్ చేతల్లో గట్టితనం లేదు

కఠినంగా ఉంటే జైళ్లు నిండేవి

ఓపికగా ముందుకెళ్తారన్న టీజీ

- 2లో...



## పెద్దాయన ముందుచూపు!

తెలంగాణ మిగులు బడ్జెట్‌కు రోశయ్యే కారణం

ఆర్యవైశ్యుల ఐక్యతకు సీఎం రేవంత్ పిలుపు?

ఆర్యవైశ్యుల సేవలకు గుర్తింపు

ఐక్యతతో రాజకీయ వాటా సాధించాలి

- 2లో...

ఆర్యవైశ్యుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలను గుర్తుచేసుకున్నారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రం ఆవిర్భవించడానికి రోశయ్య దూరదృష్టి కీలక కారణమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## పదవులు కాదు.. ప్రజలే ముఖ్యం

పదవి పోయినా బాధ లేదని వెల్లడి.. కాంగ్రెస్ వీడేది లేదన్న కొండా సురేఖ

## పదవులు వస్తాయ్... పోతాయ్

కుతూరు రాజకీయాలతో సంబంధం లేదు

మాటకు కట్టుబడి ఉంటామన్న కొండా మురళి



## ఇండియన్ నాన్‌వెజ్ ఎంతో టేస్టీ



- 3లో...

బ్రిక్స్ దేశాలకు వెజ్ భోజనంపై రచ్చ

విందుపై రాహుల్ గాంధీ సైటర్లు

## ఆంక్షలకు చెక్.. బ్రిక్స్‌కు కొత్త ఆర్థిక బలం



బ్రిక్స్‌లో రష్యా కొత్త ఆర్థిక ప్రతిపాదనలు

అమెరికా, యూరప్ ఆంక్షలకు కౌంటర్ వ్యవస్థ

ధాన్య మార్కెట్, బీమాపై పుతిన్ ప్రతిపాదనలు

- 6లో...

## 2029 నాటికి 21 రాష్ట్రాల్లో యూసీసీ

అక్రమ వలసలపై కఠిన చర్యలకు ప్రకటన

ఎన్డీయే స్టేట్స్‌లో అమలుకు అమిత్ షా హామీ



- 3లో...

## ఎంపీ సీఎం పదవికి రాజీనామా..!

బాలాఘాట్ వివాదంపై దీప్కే వ్యంగ్యం

బాలల మృతిపై సర్కారుపై సీజేపీ దూకుడు

- 3లో...



## బ్రిక్స్ ఏకాభిప్రాయానికి భారత్ కృషి

ఇరాన్-యూఏఈ మధ్య దౌత్య విజయం

గాజా విషయంలో ఇజ్రాయెల్‌పై విమర్శలు

విభేదాలకు తెర.. ఢిల్లీ ప్రకటనకు ఆమోదం

- వివరాలు 3లో...

### పంచముఖ రూపంలో దర్శనం

# ఖైరతాబాద్ గణనాథుడి వైభవం



## భక్తులకు సంకటహర ఆశీస్సులు

## వినాయక చవితికి సిద్ధమైన మహాగణపతి

హైదరాబాద్‌లో వినాయక చవితి సందడి మొదలయ్యే వేళ.. ఖైరతాబాద్ మహాగణపతి భక్తులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తైన ఖైరతాబాద్ గణనాథుడు 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా దర్శనమివ్వనున్నాడు. వినాయక చవితి సందర్భంగా ఈ ప్రత్యేక రూపంలో గణనాథుడిని ప్రతిష్ఠించేందుకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. పంచముఖ రూపం, విశాలమైన విగ్రహం భక్తుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. నగరంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఖైర తాబాద్ వినాయక ఉత్సవానికి ఈసారి కూడా భారీ సం ఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.

### శాస్త్రోక్త పూజతో విగ్రహ నిర్మాణానికి శ్రీకారం

వినాయకచవితి సెప్టెంబర్ 14న జరగనున్న నేపథ్యంలో విగ్రహ నిర్మాణ పనులు మూడు నెలల ముందుగానే ప్రారంభించారు. సంప్రదాయంగా నిర్వహించే 'కర్ర పూజ'తో మహాగణపతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ ఆచారం ప్రకారం విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. విగ్రహానికి కుడివైపు 15 అడుగుల సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాతను ఏర్పాటు చేయనున్నారు. దీంతో పంచముఖ సంకటహర మహాగణపతి రూపం మరింత వైభవంగా కనిపించనుంది.

### పర్యావరణహిత విగ్రహానికి భారీ ఏర్పాట్లు

భారీ పరిమాణంలో ఉన్నప్పటికీ విగ్రహాన్ని పర్యావరణహిత పదార్థాలతో రూపొందిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల నుంచి మట్టి, ఉక్కు, ఎండుగడ్డి, వరి పొట్టు, చెక్క వంటి నిర్మాణ సామగ్రిని తీసుకొచ్చారు. దాదాపు 100 మందికి పైగా నైపుణ్యం కలిగిన కార్మికులు విగ్రహ నిర్మాణంలో పాల్గొంటున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఖైరతాబాద్ గణనాథుడి రూపకల్పనలో భాగమవుతున్న శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయి. వినాయక చవితికి మూడు రోజుల ముందుగానే విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేసేలా పనులను వేగంగా కొనసాగిస్తున్నారు. భక్తులకు సంకటాలను తొలగించే గణనాథుడిగా పంచముఖ మహాగణపతి దర్శనం ఇవ్వనున్న వేళ ఖైరతాబాద్ మరోసారి భక్తి, వైభవానికి కేంద్రంగా మారనుంది.

# పెద్దాయన ముందుచూపు!

## తెలంగాణ మిగులు బడ్జెట్‌కు రోశయ్యే కారణం

## ఆర్యవైశ్యుల ఐక్యతకు సీఎం రేవంత్ పిలుపు



ఆర్యవైశ్యుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలను గుర్తుచేసుకున్నారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రం ఆవిర్భవించడానికి రోశయ్య దూరదృష్టి కీలక కారణమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రోశయ్యకు రాజకీయంగా అవకాశాలు, గౌరవం కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. శాసనమండలిలో తాను దూకుడుగా మాట్లాడుతున్న సమయంలో రోశయ్య పిలిచి ఆవేశాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి ఎదుగుతావని సూచించారని గుర్తుచేశారు. తనను రాజకీయంగా ముందుగా గుర్తించిన నాయకుడు రోశయ్యేనని రేవంత్ చెప్పారు. రోశయ్య విమర్శలు, దూషణలకు దూరంగా ఉంటూ చురకలతో తనదైన శైలిలో మాట్లాడేవారని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని రోశయ్య గౌరవంగా చెప్పిన నేపథ్యంలో, ఆయన గౌరవాన్ని కాపాడే ఉద్దేశంతో నగర నడిబొడ్డున విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

### ఆర్యవైశ్యుల సేవలకు గుర్తింపు

ఆర్యవైశ్యులు సౌమ్య స్వభావం, ఆత్మాభిమానం, ముందుచూపు, జాగ్రత్తకు ప్రతీకలని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సమాజంలో గౌరవంగా జీవించేందుకు ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. గ్రామాల్లో పేదలకు అవసరమైనప్పుడు అప్పుగా సాయం చేయడం నుంచి శుభకార్యాల్లో అండగా నిలవడం వరకు ఆర్యవైశ్యుల పాత్ర కీలకమని ప్రశంసించారు. వ్యవసాయం, వ్యాపారం ప్రపంచంలోని ప్రధాన వృత్తులని పేర్కొంటూ, గతంలో పలువురు ముఖ్యమంత్రులు వ్యాపార వ్యవహారాల నిర్వహణలో ఆర్యవైశ్యులపై విశ్వాసం ఉంచారని గుర్తుచేశారు. మహాత్మా గాంధీ ప్రపంచస్థాయి నాయకుడిగా ఎదిగిన ఆర్యవైశ్య బిడ్డ అని రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీ కాంగ్రెస్ నాయకుడిగా ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేశారని గుర్తుచేస్తూ, ఆర్యవైశ్య ప్రముఖులకు తగిన గుర్తింపు ఇంకా రావాల్సి ఉందన్నారు.

### ఐక్యతతో రాజకీయ వాటా సాధించాలి

ఆర్యవైశ్యుల సంక్షేమంపై తమ ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పేద ఆర్యవైశ్య కుటుంబాల పిల్లలకు ఆత్మగౌరవ భవనం పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా చూడాలని, భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. తాను ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటానని చెప్పారు. ఇప్పటికే ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ పదవి కల్పించామని, కొడంగల్‌లోని ఒక మున్సిపాలిటీలో ఆర్యవైశ్య వర్గానికి చైర్మన్ పదవి ఇచ్చామని తెలిపారు. రాజకీయాల్లో తమకు రావాల్సిన వాటాను ఆర్యవైశ్యులు సాధించుకోవాలని సూచించారు. ఐక్యంగా, ఒక్కతాటిపై నడిస్తేనే రాజకీయంగా బలం పెరుగుతుందని అన్నారు. ఆర్యవైశ్యుల ముందుచూపు, జాగ్రత్త వారి స్వభావంలోనే ఉన్నాయని పేర్కొన్నారు.

# రేవంత్ చేతల్లో గట్టితనం లేదు

## కఠినంగా ఉంటే జైళ్లు నిండేవి

## ఓపికగా ముందుకెళ్తారన్న టీజీ



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి మాటల్లో కనిపించే గట్టితనం ఆయన చేతల్లో కనిపించదని అన్నారు. ఒకవేళ సీఎం తన మాటల్లో ఉన్నంత కఠినంగా వ్యవహరించి ఉంటే తెలంగాణలో ఈపాటికి ఎంతోమంది జైలుకు వెళ్లేవారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే రేవంత్‌రెడ్డి ఆవేశంతో నిర్ణయాలు తీసుకునే వ్యక్తి కాదని, ఓపికగా పరిస్థితులను గమనించి, సరైన సమయం కోసం ఎదురుచూసి ముందుకు సాగే స్వభావం ఆయనకు ఉందని టీజీ వెంకటేశ్ ప్రశంసించారు. హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో జరిగిన ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

### ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యం

ఆర్యవైశ్యుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి గౌరవం ఉందని టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు, తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ ఆర్యవైశ్యులకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం, పదవులు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తన వంతు సహకారంగా రూ.కోటి విరాళం ప్రకటించారు. ఆర్యవైశ్యులకు తగిన గుర్తింపు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. తన పేరులోని 'టీజీ' అంశాన్ని కూడా టీజీ వెంకటేశ్ ప్రస్తావించారు. భవన నిర్మాణం కేవలం ఒక నిర్మాణ కార్యక్రమంగా కాకుండా ఆర్యవైశ్యుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు.

# ఉద్యోగానికి వీడ్కోలు.. ప్రజాసేవకు అడుగు

## ఎంపీటీసీగా బరిలోకి లక్ష్మణ్ నాయక్



ప్రభుత్వ ఉద్యోగం ముగిసింది.. ప్రజాసేవే లక్ష్యంగా రిటైర్డ్ ఏడీఈ భూక్యా లక్ష్మణ్ నాయక్ రాజకీయాల్లోకి అడుగులు వేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామపంచాయతీ పరిధిలోని రూప్లానాయక్ తండాకు చెందిన ఆయన ప్రభుత్వ శాఖలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ)గా సుదీర్ఘకాలం పనిచేశారు. ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, నిజాయితీకి ప్రాధాన్యం ఇచ్చిన లక్ష్మణ్ నాయక్.. పదవీ విరమణ తర్వాత కూడా ప్రజలకు చేరువగానే ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ అవకాశం కల్పిస్తే ఎంపీటీసీగా పోటీ చేసి, ప్రజల ఆశీస్సులతో ఎంపీపీగా ఎన్నికై మండల అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ నాయకులు, కార్యకర్తలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తున్నారు.

### సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ

ప్రజాసేవలో భాగంగా లక్ష్మణ్ నాయక్ ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టారు. గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేయగా, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించారు. అవసరమైన వారికి సహాయం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఉమ్మడి మానాల ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆశీస్సులతో, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మానాల మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకు సాగుతానని లక్ష్మణ్ నాయక్ స్పష్టం చేశారు. పార్టీ అప్పగించే బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానన్నారు. దీంతో కాంగ్రెస్ ఆయనకు ఎలాంటి అవకాశం కల్పిస్తుందన్నది రుద్రంగి మండల రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# పదవులు కాదు.. ప్రజలే ముఖ్యం

## పదవి పోయినా బాధ లేదని వెల్లడి

## కాంగ్రెస్ వీడేది లేదన్న కొండా సురేఖ



మంత్రి పదవి నుంచి తొలగించినా కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని కొండా సురేఖ, కొండా మురళి స్పష్టం చేశారు. పదవులు తమకు ఎప్పుడూ ముఖ్యమైనవి కావని, ప్రజల్లో చిరస్థాయిగా గుర్తుండటమే తమ లక్ష్యమని చెప్పారు. మంత్రి పదవి నుంచి తొలగించిన తర్వాత తొలిసారిగా ఆదివారం వరంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు, అనుచరులతో కొండా దంపతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. మంత్రి పదవి కోల్పోయి నందుకు బాధ లేదని, అయితే అకారణంగా తొలగిం చిన కారణమే బాధ కలిగించిందని అన్నారు. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంలో కాంగ్రెస్ అధి ష్ఠానం నిర్ణయం తీసుకున్నప్పటికీ, తాను పార్టీకి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. తన తొలగింపుపై కొందరు ఆందోళనలకు సిద్ధమయ్యారని, అయితే అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించాలని వారికి సూచిం చినట్లు వెల్లడించారు.

### అవకాశవాద రాజకీయాలపై విమర్శలు

తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న సురేఖ ఎంపీపీ స్థాయి నుంచి మంత్రి పదవి వరకు ఎదిగానని చెప్పారు. కొందరు నాయకులు తరచూ పార్టీలు మారు తున్నారని, ఇది అవకాశవాద రాజకీయాలకు నిదర్శ నమని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కోసం గతంలో మంత్రి పదవికి రాజీ నామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2014లో కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కని సమయంలో అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ తనను పిలిచి వరంగల్ తూర్పు టికెట్ ఇచ్చారని చెప్పారు. ఆ ఎన్ని కల్లో అప్పటి కాంగ్రెస్ మంత్రిని ఓడించినట్లు తెలిపారు. 2018లో కాంగ్రెస్‌లో చేరి, 2023లో అదే నియోజ కవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన విషయాన్ని ప్రస్తావించారు. తన విజయంతో వరంగల్ తూర్పు ప్రజలకు ధైర్యం వచ్చిందని, కొండా మురళి అండగా ఉన్నారనే నమ్మకంతో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని పేర్కొన్నారు.

### పదవి పోయినా పోరాటం ఆగదు

మంత్రి పదవి కోల్పోయినంత మాత్రాన ఇంటికే పరిమితం కాబోనని సురేఖ తేల్చిచెప్పారు. పదవులు ఇవాళ ఉంటాయి.. రేపు పోతాయి. ప్రజల్లో ఉండటమే తమకు ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల కోసం పాదయాత్ర చేసినప్పుడు, కాంగ్రెస్‌కు ఆయనలాంటి మాస్ లీడర్ అవసరమని చెప్పిన తొలి వ్యక్తిని తానేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం, తనకు మంత్రి పదవి రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. పదవి కేవలం అలంకారం మాత్రమేనని, పదవి లేకపోయినా ప్రజలకు సేవ చేయవచ్చని అన్నారు. రాబోయే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలుచుకునేలా కార్యకర్తలతో కలిసి పనిచేస్తామని సురేఖ ప్రకటించారు. కొండా మురళి సైతం కాంగ్రెస్‌ను వీడబోమని స్పష్టం చేయడంతో వరంగల్ కాంగ్రెస్‌లో కొండా దంపతుల తదుపరి రాజకీయ అడుగులపై ఆసక్తి నెలకొంది.



# కేటీఆర్ సిబ్బందికి నోటీసులు

## పండుగ రోజే విచారణకు పిలుపు.. హైకోర్టు ఆదేశాలతో ఘటనపై కేసు

బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పీఏ మహేం దర్‌రెడ్డి, పీఆర్వో మహేశ్‌కు సైఫాబాద్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 7న అసెంబ్లీ గేట్ నంబర్ 3 వద్ద జరిగిన ఘటనకు సంబంధించి నమోదైన కేసులో ఇద్దరినీ విచారణకు పిలిచారు. సోమవారం ఉదయం 10 గంటలకు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో హాజరై దర్యాప్తునకు సహకరించాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. ఈ కేసు నేపథ్యంలో మహేం దర్‌రెడ్డి, మహేశ్ హైకోర్టును ఆశ్రయించారు. తమపై నమోదైన కేసును కొట్టివేయాలని వారు న్యాయస్థానాన్ని కోరారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ఇద్దరికీ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది.

### కోర్టు ఆదేశాలతో విచారణ

హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసినప్పటికీ పోలీసుల దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని ఇద్దరినీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం సూచనలకు అనుగుణంగా సైఫాబాద్ పోలీసులు తాజాగా నోటీసులు జారీ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి మహేందర్‌రెడ్డి, మహేశ్ నుంచి పోలీసులు వివ రాలు సేకరించనున్నారు. హైకోర్టు రక్షణ కల్పించిన నేప థ్యంలో విచారణ ప్రక్రియ ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు పండుగ రోజునే విచారణకు హాజరుకావా లని పోలీసులు నోటీసులు ఇవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరవుతారా, కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.



# పదవులు వస్తాయ్... పోతాయ్

## కుతూరు రాజకీయాలతో సంబంధం లేదు

## మాటకు కట్టుబడి ఉంటామన్న కొండా మురళి

వరంగల్‌లో కార్యకర్తల సమావేశంలో కొండా మురళి కీలక వ్యాఖ్యలు చేశారు. పదవులు శాశ్వతం కాదని, ఇవాళ ఉంటాయని.. రేపు పోతాయని అన్నారు. అయితే మాటపై నిలబడటమే తమ కుటుంబానికి అలవాటని స్పష్టం చేశారు. "పదవి ఉంటే ఉండనీ.. పోతే పోనీ. సారీ అని ఏ రోజూ రాతలు రాయలేదు" అని వ్యాఖ్యానించారు. కృతజ్ఞత అనేది కొండా కుటుంబ రక్తంలోనే ఉందని చెప్పారు. ఎన్ని రోజులు బతికామన్నది కాదని, ఎలా బతికామన్నదే ముఖ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే కొండా దంపతుల లక్ష్యమని ప్రకటించారు. పార్టీలో ఉంటూ పార్టీకి వెన్నుపోటు పొడవకూడదని కార్యకర్తలకు సూచించారు.

**కార్యకర్తలే నా బలం..** తన రాజకీయ భవిష్యత్తుపై కూడా కొండా మురళి స్పష్టత ఇచ్చారు. వరంగల్ తూర్పులో 24 మంది కార్పొరేటర్లను గెలిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ తూర్పు బాధ్యతలను నవిన్ రాజ్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. కష్టపడి పనిచేసే, గెలిచే సత్తా ఉన్నవారికే కార్పొరేటర్ టికెట్లు దక్కుతాయని చెప్పారు. తనపై కబ్జా ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. తనకు, తన కుమార్తె సుస్మితకు రాజకీయంగా సంబంధం లేదని స్పష్టం చేశారు. తనను నమ్ముకుని చాలామంది నాయకులు ఉన్నారని, కొండా మురళి మాటంటే మాటేనని అన్నారు. అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగుతామని చెప్పారు. కార్యకర్తల కోసం అవసరమైతే మరో 10 ఎకరాల భూమినైనా అమ్ముతానని, కార్యకర్తలే తన బలమని కొండా మురళి పేర్కొన్నారు.

# 19న కోదాడలో మెగా జాబ్ మేళా

## 4 వేల మంది ఉద్యోగవకాశాలు

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



కోదాడ: కోదాడలో సెప్టెంబర్ 19న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ద్వారా మూడు వేల నుంచి నాలుగు వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. దాదాపు 300 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొననున్నాయని, వేలాది ఉద్యోగ ఖాళీల భర్తీకి అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నాయని తెలిపారు. ఉద్యోగాల కోసం గ్రామీణ యువత నగరాలు, ఇతర రాష్ట్రాల చుట్టూ తిరిగే పరిస్థితిని మార్చి, కంపెనీలనే వారి వద్దకు తీసుకురావాలన్న సంకల్పంతో ఈ భారీ నియామక కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. కోదాడలో ఆదివారం జాబ్ మేళా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన విద్యావంతులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొని, తమ బయోడేటా ఐదు ప్రతులతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. దాదాపు 300 కంపెనీలు మొత్తం 27 వేల మంది ఉద్యోగుల అవసరంతో కోదాడకు వస్తున్నాయని మంత్రి తెలిపారు. అందులో కనీసం 15 శాతం అవసరాన్ని తీర్చగలిగినా మూడు వేల నుంచి నాలుగు వేల మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. వేలాది మంది యువతకు ఉపాధి కల్పించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపగలిగితే అది గొప్ప విజయమే కాకుండా తనకు ఎంతో సంతృప్తినిచ్చే సందర్భమవుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన యువతకు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులకు నేరుగా అనుసంధానం కల్పించడమే ఈ జాబ్ మేళా ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. చేతిలో పట్టా, కళ్లలో భవిష్యత్తుపై ఎన్నో కలలు ఉన్నప్పటికీ సరైన సమాచారం, పరిచయాలు, అవకాశాలు లేక అనేకమంది యువత ఉద్యోగాలకు దూరమవుతున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 2025 అక్టోబర్‌లో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత నుంచి అపూర్వ స్పందన లభించిందని మంత్రి గుర్తుచేశారు. ఆ జాబ్ మేళాకు 40 వేల మందికిపైగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోగా, సుమారు 20 వేల నుంచి 21 వేల మంది అభ్యర్థులు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. వారిలో మూడు వేల నుంచి మూడున్నర వేల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని వివరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లను ఆహ్వానించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. వారు జాబ్ మేళాకు హాజరై, ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాలు అందించే అవకాశం ఉందన్నారు.

# ఆంక్షలతో ఆహార భద్రతకు ముప్పు

### యూరప్ దేశాలపై విరుచుకుపడ్డ ఇరాన్

### అంతకంతకూ అనుభవిస్తారన్న పెజెష్కియాన్

### జాతీయ కరెన్సీలతో వాణిజ్యానికి పిలుపు



న్యూఢిల్లీలో జరిగిన రెండు రోజుల బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ పశ్చిమ దేశాల విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఏకపక్ష ఆర్థిక ఆంక్షలు ప్రపంచ ఆహార భద్రతను, ప్రజల సంక్షేమాన్ని నేరుగా దెబ్బతీ స్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రస్తుత ఆర్థిక, వాణిజ్య వ్యవస్థలపై అధిక ఆధారపడటం వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలు రాజకీయ పరిణామాల ప్రభా వానికి సులభంగా గురవుతున్నాయని పేర్కొన్నారు. బ్రిక్స్ కేవలం అభివృద్ధి చెందుతున్న దేశాల సహకార వేదికగా పరిమితం కాకుండా సమతుల్య, సమగ్ర, న్యాయబద్ధమైన అంతర్జాతీయ వ్యవస్థ నిర్మాణంలో మరింత కీలక పాత్ర పోషించాల్సిన సమయం వచ్చిందని పెజెష్కియాన్ అన్నారు. ఏ ఒక్క శక్తికేంద్రా నికీ ఇతర దేశాల భవిష్యత్తును నిర్ణయించే హక్కు ఉండకూడదని స్పష్టం చేశారు.

#### యుద్ధ ప్రభావాలపై ఆందోళన

అమెరికా, ఇజ్రాయెల్ దాడులుగా ఆయన అభివర్ణి ంచిన సైనిక చర్యలను ప్రస్తావిస్తూ.. భద్రత లేకుండా ఆర్థిక స్థిరత్వం సాధ్యం కాదని పెజెష్కియాన్ అన్నారు. ఇరాన్‌లో ఆర్థిక, ఇంధన, అభివృద్ధి మౌలిక వసతులపై దాడులు దేశ సరిహద్దులను దాటి ప్రాంతీయ, ప్రపంచ స్థాయిలో ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిం చారు. ఇరాన్ ప్రజలు భారీ మూల్యం చెల్లించారని, పౌరులు ప్రాణాలు కోల్పోగా దశాబ్దాలుగా నిర్మించిన మౌలిక వసతులు దెబ్బతిన్నాయని చెప్పారు. పౌరుల రక్షణకు అంతర్జాతీయ సమాజం బాధ్యత వహించాలని, పౌర ప్రాంతాలపై దాడులను సాధారణ విషయంగా మారనివ్వకూడదని కోరారు. గాజా, లెబనాన్ ప్రజలు తీవ్ర విషాదాన్ని ఎదుర్కొం టున్నారని పేర్కొంటూ.. జాతీయ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, బలప్రయోగ నిషేధాన్ని కాపాడటంలో బ్రిక్స్ మరింత సమర్థవంతమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

#### జాతీయ కరెన్సీలతో వాణిజ్యానికి పిలుపు

బ్రిక్స్ ఆర్థిక స్థితిస్థాపకతను పెంచేందుకు పెజెష్కియాన్ పలు సూచనలు చేశారు. సభ్య దేశాల మధ్య జాతీయ కరెన్సీల్లో వాణిజ్యాన్ని విస్తరించాలని, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్‌ను మరింత బలోపేతం చేయాలని ప్రతిపాదించారు. గ్లోబల్ సౌత్ దేశాల సామర్థ్యాలను ఉమ్మడి శక్తిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇరాన్ భౌగోళిక స్థానం, ఇంధన వనరులు, రవాణా సామర్థ్యాలను ఉపయోగించు కుని బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్య, ఇంధన మార్గాల ను అభివృద్ధి చేయవచ్చని చెప్పారు. భవిష్యత్ ప్రపంచానికి జ్ఞానం, ఆవిష్కరణలు కీలకమని పేర్కొంటూ కృత్రిమ మేధ, కొత్త సాంకేతికతలు దేశాలను బలోపేతం చేసే సాధనాలుగా ఉండాలి కానీ ఆధిపత్యానికి ఆయుధాలుగా మారకూడదని స్పష్టం చేశారు. యుద్ధం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపైనా ఆందోళన వ్యక్తం చేశారు. సుస్థిర అభివృద్ధి అంటే అసమానతలు పెంచడం కాదని, భవిష్యత్ తరాలపై భారాన్ని మోపకూడదని చెప్పారు. భారత్ ఆతిథ్యానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపిన పెజెష్కియాన్.. బ్రిక్స్ సిద్ధాంతాలను ఆచరణలోకి తీసుకెళ్లే శక్తివంతమైన వేదికగా మారాలని పిలుపునిచ్చారు.

# మధుమేహ గుండెకు సజ్జ భరోసా

## బైపాస్ పరిశోధనకు అంతర్జాతీయ గుర్తింపు

మధుమేహంతో బాధపడుతున్న గుండె రోగులకు శు భవార్త అందించే కీలక పరిశోధన వెలుగులోకి వచ్చింది. కరోనరీ బైపాస్ శస్త్రచికిత్సలో ఏ విధానం మెరుగైన ఫలి తాలను అందిస్తుంది? అనే ప్రశ్నకు సమాధానం వెతు కుతూ నిర్వహించిన 'ప్రెడిక్ట్ ట్రయల్' అధ్యయనం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది ంది. ప్రపంచవ్యాప్తంగా కార్డియోథొరాసిక్ శస్త్రచి కిత్స రంగంలో ప్రముఖ పరిశోధనలను ప్రచురించే 'జేటీసీవీఎస్ ఓపెన్' అంతర్జా తీయ వైద్య పత్రికలో ఈ అధ్యయనం ప్రచురి తమైంది. అమెరికన్ అసోసి యేషన్ ఫర్ థొరాసిక్ సర్జరీ అధికా రిక స్వేచ్ఛా ప్రచు రణ పత్రికగా దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గుండె ధమ నుల్లో అడ్డంకులు ఏర్పడి, అదే సమయంలో మధుమేహ ంతో బాధపడుతున్న రోగులకు బైపాస్ శస్త్రచికిత్స సమయంలో అనుసరించాల్సిన ఉత్తమ విధానాన్ని గుర్తించడమే ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం. వివిధ ప్రముఖ ఆసుపత్రుల్లో రోగులను చేర్చి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిన బహుళ కేంద్రాల యాదృచ్ఛిక నియంత్రిత పరిశోధన కావ డం దీని ప్రత్యే కత. ఈ ఫలితాలు గుండె శస్త్రచికిత్సలో భవిష్యత్ చికిత్సా విధానాలకు మరింత బలమైన శాస్త్రీయ ఆధారాలను అంది ంచే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

#### మధుమేహ రోగులకు మెరుగైన చికిత్స లక్ష్యం

మధుమేహం ఉన్నవారిలో గుండె జబ్బుల ముప్పు సాధారణంగా ఎక్కువగా ఉంటుంది. గుండె ధమనుల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు బైపాస్ శస్త్రచికిత్స అవస రమయ్యే పరిస్థితులు ఎదురవుతాయి. అయితే మధు మేహం కారణంగా శస్త్రచికిత్సకు ముందు, తరువాత రోగి సంరక్షణ మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉం టుంది. ఇలాంటి రోగుల్లో శస్త్రచికిత్స ఫలితాలను మెరు గుపరచడం వైద్య రంగానికి చాలాకాలంగా ఒక సవాలు గా ఉంది. ఈ నేపథ్యంలో ప్రెడిక్ట్ ట్రయల్ ద్వారా సేకరించిన శాస్త్రీయ సమాచారం వైద్యులకు కీలక మార్గదర్శకంగా ఉపయోగపడనుంది. ఈ పరిశోధనకు భారతీయ వైద్య పరిశోధన మండలి, సజ్జ హార్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా మద్దతు అందించాయి. బైపాస్ శస్త్రచికిత్సలో సరైన విధానాన్ని ఎంచుకోవడం ద్వారా రోగుల చికిత్సా ఫలితాలను మెరుగుపరచడం, దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడటం, జీవన నాణ్యతను పెంచడం వంటి అంశాలకు ఈ అధ్యయనం ప్రాధాన్యం ఇచ్చింది. పరిశోధనలో లభించిన ఆధారాలు వైద్యులు రోగి పరిస్థితిని మరింత శాస్త్రీయంగా అంచనా వేసి చికిత్స నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగపడవచ్చు. భారతదేశంలో నిర్వహించిన ఈ స్థాయి పరిశోధనకు ప్రముఖ అంతర్జాతీయ పత్రికలో స్థానం లభించడం భారతీయ వైద్య పరిశోధన సామర్థ్యానికి గుర్తింపుగా నిలిచింది. భవిష్యత్తులో గుండె శస్త్రచికిత్స విధానాల్లో మార్పులకు ఈ పరిశోధన దోహదం చేయవచ్చని వైద్య నిపుణులు భావిస్తున్నారు.






#### డాక్టర్ సజ్జ కీలక వ్యాఖ్యలు

ఈ ప్రతిష్ఠాత్మక పరిశోధనలో ప్రముఖ కార్డియాక్ సర్జన్, పరిశోధకుడు డాక్టర్ లోకేశ్వరరావు సజ్జ కీలకం గా పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సీనియర్ గుండె శస్త్ర చికిత్స నిపుణుడిగా గుర్తింపు పొందిన ఆయన, మధు మేహ రోగుల్లో గుండె జబ్బులు అధికంగా కనిపిస్తాయని తెలిపారు. "మధుమేహం ఉన్న రోగుల్లో గుండె శస్త్ర చికిత్స ఫలితాలను మెరుగుపరచడం ఎప్పటి నుంచో ఒక సవాలుగా ఉంది. ప్రెడిక్ట్ ట్రయల్ ఫలితాలు ఈ విషయంలో మాకు ఎంతో విలువైన అవగాహన ఇచ్చాయి. రోగులకు మరింత సురక్షితమైన, ప్రభావవంతమైన చికిత్స అందించేందుకు ఈ పరిశోధన సహాయ పడుతుంది" అని ఆయన పేర్కొ న్నారు. ఈ అధ్యయనం వెనుక పలువురు వైద్యులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు నిరంతరం శ్రమించారు. వివిధ ఆసుపత్రులు, పరిశో ధనా బృందాలు, సహకరి ంచిన సంస్థల సమిష్టి కృషితో ఈ పరిశోధన విజయ వంతమైంది. జేటీసీవీఎస్ ఓపెన్ లో ప్రచురణ పొంద డం కేవలం ఒక పరిశోధనా విజ యమే కాదు.. మధు మేహంతో బాధపడుతున్న గుండె రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించాలనే వైద్య రంగం ప్రయ త్నాలకు బలమైన ముందడుగు. శాస్త్రీయ ఆధారాలతో చికిత్సా విధానాలను మెరుగుపరచడం ద్వారా రోగుల జీవితకాలం, జీవన నాణ్యతను పెంచేందుకు ఈ అధ్యయనం భవిష్యత్తులో ఉపయోగ పడే అవకాశాలు ఉన్నాయి.




# భళా మోదీ

### బ్రిక్స్ వేదికగా ఇండియా దౌత్య విజయం

### రక్షణ భాగస్వామ్యాలకు కొత్త బలం

### ఆసియా, ఆఫ్రికాతో వ్యూహాత్మక బంధం

న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ వరుస ద్వైపాక్షిక సమావేశాలతో భారత్ వ్యూహాత్మక దౌత్యాన్ని విస్తరి ంచారు. రక్షణ, భద్రతా సహకా రానికి ఈ భేటీల్లో ప్రధాన ప్రాధాన్యం లభించింది. కజకిస్థాన్ అధ్య క్షుడు కాసిమ్-జోమార్ట్ టోకయేవ్, ఫిలిప్పీన్స్ అధ్య క్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్, ఉగాండా ఉపాధ్యక్షు రాలు జెస్సికా రోజ్ ఎపెల్ అలుపో, నైజీరియా ఉపా ధ్యక్షుడు కాషిమ్ షెట్టిమా, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఆఫ్రికన్ యూనియన్ చైర్మన్ ఎవ రీస్టే న్డాయిషిమియేతో మోదీ చర్చలు జరిపారు. రక్షణ రంగంతో పాటు వాణిజ్యం, సాంకేతికత, ఇంధనం, పెట్టుబడులు, కనెక్టివిటీ, డిజిటల్ రంగాల్లో భాగస్వా మ్యాన్ని పెంచే అంశాలు కూడా చర్చకు వచ్చాయి.

#### ఫిలిప్పీన్స్‌తో బ్రహ్మోస్ బంధం

దక్షిణాసియా ప్రాంతంలో భారత్ రక్షణ దౌత్యానికి ఫిలిప్పీన్స్ కీలక భాగస్వామిగా ఎదుగుతోంది. మోదీ–మార్కోస్ భేటీలో రక్షణ, భద్రతా సహకారాన్ని మరిం త బలోపేతం చేయాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామిగా ఫిలిప్పీన్స్ 2025 ఆగస్టులో మారింది. భారత రక్షణ ఉత్పత్తులకు ఆ దేశం కీలక మార్కెట్‌గా నిలుస్తోంది. ముఖ్యంగా బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థకు తొలి విదేశీ కొనుగోలుదారుగా ఫిలిప్పీన్స్ నిలిచింది. 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కింద క్షిపణుల సరఫరా, శిక్షణ ప్రక్రియ కొనసాగుతోంది. కజకి స్థాన్‌తో చర్చల్లో రక్షణ, భద్రతతో పాటు ఇంధనం, కీలక ఖనిజాలు, కనెక్టివిటీ, ఆధునిక సాంకేతికతపై దృష్టి పెట్టారు. మలేషియాతో కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ప్రాథమిక చర్చలు జరుగుతున్నట్లు ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం వెల్లడించారు. అయితే దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

#### ఆఫ్రికా వైపు వ్యూహాత్మక అడుగులు

ఆఫ్రికా దేశాలతో సంబంధాల విస్తరణలో భాగంగా నైజీరియాతో మోదీ రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబ డులు, ఇంధనం, వ్యవసాయం, ఆరోగ్యం, డిజిటల్ సాంకేతికత అంశాలపై చర్చించారు. ఇరుదేశాల వ్యూ హాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని అంగీకరించారు. ఉగాండాతో సాంకేతిక సహకారం, సామర్థ్య నిర్మాణం, ప్రైవేట్ రంగ భాగస్వామ్యంపై చర్చలు జరిగాయి. ఆఫ్రికన్ యూనియన్ చైర్మన్‌తో సమావేశంలో అభివృద్ధి భాగస్వామ్యం, సామర్థ్య పెంపు పై దృష్టి పెట్టారు. దక్షిణాఫ్రికాతో కూడా వ్యూహాత్మక సహకార అంశాలు చర్చకు వచ్చాయి. మొత్తంగా బ్రిక్స్ వేదికను భారత్ రక్షణ భాగస్వామ్యాల విస్తరణకు, దేశీయ రక్షణ ఉత్పత్తుల ఎగుమతులకు, భాగస్వామ్య దేశాల సామర్థ్య పెంపుకు ఉపయోగించుకుంటున్నట్లు ఈ వరుస భేటీలు స్పష్టం చేశాయి. ఇండో–పసిఫిక్, మధ్య ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో భారత వ్యూహాత్మక ప్రభావాన్ని మరింత విస్తరించే దిశగా మోదీ దౌత్యం ముందుకు సాగుతోంది.

# బ్రిక్స్ ఏకాభిప్రాయానికి భారత్ కృషి

### ఇరాన్-యూఏఈ మధ్య దౌత్య విజయం

### గాజా విషయంలో ఇజ్రాయెల్‌పై విమర్శలు

### విభేదాలకు తెర.. ఢిల్లీ ప్రకటనకు ఆమోదం

న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో 11 దేశాలు 'న్యూఢిల్లీ డిక్లరేషన్'ను ఆమోదించాయి. పశ్చిమాసియా యుద్ధం పై ఇరాన్, యూఏఈ భిన్న వైఖరులతో ఉండటంతో సంయుక్త ప్రకటన భాషపై చివరి వరకు ప్రతిష్ఠంభన కొనసాగింది. భారత దౌత్య ప్రయత్నాలతో ఇరు దేశాలు చివరకు రాజీకి రావడంతో ఏకాభిప్రాయం సాధ్య మైంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ గల్ఫ్ దేశాలపై జరిపిన ప్రతిదాడులను ప్రకట నలో నేరుగా ప్రస్తావించకుండా యుద్ధంలో "గరిష్ఠ సంయమనం" పాటించాలని బ్రిక్స్ పిలుపు నిచ్చింది. పశ్చిమాసియా పౌరులు, పౌర మౌలిక వసతులు, అణు కేంద్రాలపై దాడులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై ప్రత్యేక ప్రస్తావన చేయలేదు. ఈ పరిణామాల మధ్య ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అబుదాబి యువరాజు ఖలేద్ బిన్ మహమ్మద్ అల్ నహ్యాన్ భేటీ కావడం అరుదైన దౌత్య పరిణామంగా నిలిచింది.



#### గాజాపై ఇజ్రాయెల్‌కు బ్రిక్స్ గట్టి హెచ్చరిక

ప్రధాని మోదీ బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకంగా పనిచేసే వేదిక కాదని స్పష్టం చేశారు. భిన్న అభిప్రాయాలను గౌరవిస్తూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగడమే బ్రిక్స్ విధానమని పేర్కొన్నారు. జీ20 తరహాలో బ్రిక్స్‌లో అధ్యక్ష దేశాల మధ్య సమన్వయం కోసం 'ట్రోయికా' విధానాన్ని ప్రతిపాదించారు. ప్రపంచ పాలనలో సంస్కరణలకు రోడ్‌మ్యాప్, సముద్రంలో ప్రమాదంలో చిక్కుకున్న నావికుల కోసం సహాయ నెట్‌వర్క్, కొత్త సాంకేతికతల్లో గ్లోబల్ సౌత్ నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను సూచించారు. ఐక్యరాజ్యసమితిలో సమగ్ర సంస్కర ణలకు ప్రకటన మద్దతు తెలిపింది. భారత్, బ్రెజిల్‌లకు భద్రతా మండలిలో మరింత ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్‌ను సమర్థించింది. గాజాపై ఇజ్రాయెల్ దాడులను బ్రిక్స్ తీవ్రంగా ఖండించింది. దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానాల్లో ఇజ్రాయెల్‌పై వేసిన కేసుకు మద్దతు తెలిపింది. గాజాకు తక్షణ మానవతా సాయం, పాలస్తీనాకు రెండు దేశాల పరిష్కారం, 1967 సరిహద్దులు, తూర్పు జెరూసలేం రాజధానిగా ఉండాలని పేర్కొంది. పాలస్తీనియన్లను బలవంతంగా తరలించడాన్ని వ్యతిరేకించింది.

#### ఆర్థిక సహకారానికి జాతీయ కరెన్సీలే బాట

ఆర్థిక రంగంలో బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం, చెల్లింపులను జాతీయ కరెన్సీల్లో మరింత పెంచాలని నిర్ణయించారు. అమెరికా సుంకాలు, పాశ్చాత్య దేశాల ఏకపక్ష ఆంక్షలను బ్రిక్స్ విమర్శించింది. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన ఏకపక్ష ఆంక్షలను ఖండించింది. ఇరాన్–యూఏఈ మధ్య విభేదాలపై నెలల తరబడి జరిగిన చర్చలు చివరకు ఫలించాయని భారత ప్రతినిధులు తెలిపారు. భిన్న అనుభవాలు, అభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఏకాభిప్రాయం సాధించడమే బ్రిక్స్ బలం అని భారత షెర్పా సుధాకర్ దలేలా పేర్కొన్నారు. 2025 పహల్గామ్ ఉగ్రదాడిని ప్రస్తావిస్తూ సరిహద్దులు దాటి జరిగే ఉగ్రవాదాన్ని వ్యతిరేకించడంలో బ్రిక్స్ ఏకాభిప్రాయాన్ని కూడా ఆయన వెల్లడించారు. తదుపరి ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చైనా చేపట్టనుంది.








# ఇండియన్ నాన్‌వెజ్ ఎంతో టెస్టీ

### బ్రిక్స్ దేశాలకు వెజ్ భోజనంపై రచ్చ

### విందుపై రాహుల్ గాంధీ సైటర్లు

న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రపంచ నేతలకు ఏర్పాటు చేసిన విందు ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీసింది. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం భారత్ మండపంలో బ్రిక్స్ దేశాల నేతలు, ప్రతినిధులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో పూర్తిగా శాకాహార వంటకాలనే వడ్డించారు. అతిథులకు భారతీయ వంటకాల ప్రత్యేకతను పరిచయం చేసేలా విభిన్న రుచులతో మెనూను సిద్ధం చేశారు. ప్రారంభ వంటకాల్లో కంద్వీ మిల్లే, ఖుంబ్ గలౌటీ వంటి వంటకాలు ఉన్నాయి. ప్రధాన భోజనంలో పనీర్ లబాబ్దార్, హిమాలయ ప్రాంతపు గుచ్చి పుట్టగొడుగులు, ఆస్పరాగస్‌తో చేసిన వంటకం, క్యారెట్––బీన్స్ పొరియల్ వడ్డించారు. మిల్లెట్ పులావ్, బీట్‌రూట్ రైతా, వివిధ రకాల భారతీయ రొట్టెలు కూడా మెనూలో భాగమయ్యాయి.

#### 80 శాతం నాన్‌వెజ్ అంటూ రాహుల్

ఈ విందు జరిగిన మరుసటి రోజు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేది కగా స్పందించారు. "దేశంలో 80 శాతం మంది నాన్ వెజిటేరియన్లు. భారతీయ నాన్‌వెజిటేరియన్ ఆహారం ఎంతో రుచికరం" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. తన సోదరి ప్రియాంక గాంధీ తయారు చేసే చోలే భటూరే కూడా ఎంతో రుచికరమని పేర్కొంటూ దాని ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. బ్రిక్స్ విందులో పూర్తిగా శాకాహార మెనూ ఏర్పాటు చేసిన నేపథ్యంలో రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు కారణమయ్యాయి. అయితే ఆయన వ్యాఖ్యలు విందులోని వంటకాలపై నేరుగా విమర్శగా కాకుండా భారతీయ ఆహార వైవిధ్యాన్ని గుర్తుచేసే వ్యాఖ్యలుగా కనిపించాయి.

#### భారతీయ రుచులతో సాంస్కృతిక ప్రదర్శన

బ్రిక్స్ విందులో భోజనంతో పాటు భారతీయ సంస్కృతికి కూడా ప్రత్యేక స్థానం కల్పించారు. డెజర్ట్‌గా ఓల్డ్ ఢిల్లీ ఫ్రూట్ క్రీమ్‌తో జిలేబీ, షాహ్‌తూత్ ఫిర్నీ వంటి ప్రత్యేక వంటకాలను అతిథులకు అందించారు. దేశంలోని వివిధ ప్రాంతాల రుచులను ఒకే మెనూలో పరిచయం చేసే ప్రయత్నం జరిగింది. విందు సందర్భంగా భారత్ సహా బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన 100 మందికి పైగా కళాకారులతో కూడిన బృందం ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చింది. ప్రపంచ నేతలకు భారతీయ ఆహారం, సంప్రదాయ కళలను పరిచయం చేయడం ద్వారా సదస్సును సాంస్కృతిక అనుభూతిగా మార్చారు. ఇదే సమయంలో రాహుల్ గాంధీ చేసిన నాన్‌వెజ్ ఆహారంపై వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు వచ్చాయి. బ్రిక్స్ దౌత్య వేదికపై జరిగిన విందు.. రాజకీయ వ్యాఖ్యలకు కూడా వేదికగా మారింది.



# 2029 నాటికి 21 రాష్ట్రాల్లో యూసీసీ



### అక్రమ వలసలపై కఠిన చర్యలకు ప్రకటన

### ఎన్డీయే స్టేట్స్‌లో అమలుకు అమిత్ షా హామీ

దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి అమలుపై కేంద్రం మరోసారి స్పష్టమైన లక్ష్యాన్ని ప్రకటించింది. బీజేపీ, ఎన్డీయే అధికారంలో ఉన్న 21 రాష్ట్రాల్లో 2029 నాటికి యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఆదివారం ముంబైలో మీడియాతో మాట్లాడిన ఆయన.. దేశంలో ఉన్న ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి, వారిని దేశం నుంచి పంపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మణిపూర్‌లో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ అమలుకు మాత్రం ఇప్పుడే కాలపరిమితి చెప్పలేమని స్పష్టం చేశారు. 1951ను ప్రాథమిక ఆధార సంవత్సరంగా తీసుకోవాలన్న అంశంపై మిత్రపక్షాలు, రాజకీయ పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో యూసీసీ అమలు తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని ఆయన పునరుద్ఘాటించారు.

#### జెన్-జెడ్ నిరసనలపై స్పందన

జూలైలో జరిగిన జెన్–జెడ్ నిరసనలపై కూడా అమిత్ షా స్పందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని చెప్పారు. అందరితో మాట్లాడేం దుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దేశాన్ని ఎమర్జెన్సీ తరహా పరిస్థితుల్లో నడపాలన్న ఉద్దేశం బీజేపీకి లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలన సంస్కృతి వేరని, తమ ప్రభుత్వ విధానం వేరని ఆయన వ్యాఖ్యానించారు. మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను గుర్తుచేస్తూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు మహారాష్ట్ర లోని సహకార బ్యాంకు వ్యవహారంలో రూ.25 వేల కోట్ల మేర ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కాంగ్రెస్ అమిత్ షాను ప్రశ్నిం చింది. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల నివేదికల్లో తేడాలు ఉన్న నేపథ్యంలో వైట్ పేపర్ విడుదల చేయాలన్న డిమాండ్‌కు షా స్పందిస్తూ.. దర్యాప్తు సంస్థలు తమ పని చేస్తున్నాయని, అవసరమైన సమయంలో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తాయని చెప్పారు.

#### భాషా వివాదంపై సమతుల్య వైఖరి

మహారాష్ట్రలో వలసలు, భాష, ప్రాంతీయ గుర్తింపుపై తలెత్తుతున్న వివాదాలపైనా అమిత్ షా మాట్లాడారు. మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ విధానమని, రాష్ట్రాలు కూడా రాజ్యాంగ మార్గదర్శకాలను పాటించాల్సి ఉంటుందని చెప్పారు. కొన్ని వ్యక్తులు ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే అక్కడక్కడా ఘటనలు జరగవచ్చని, అయితే రాష్ట్ర ప్రభుత్వాలు పరిస్థితిని చక్కదిద్దగల సామర్థ్యం కలిగి ఉన్నాయని అన్నా రు. ముంబై, పుణే వంటి ఆర్థిక కేంద్రాల్లో వలస జనాభా బీజేపీకి కీలక మద్దతుదారులుగా ఉన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించు కున్నాయి. మరో కార్యక్రమంలో జెమ్ అండ్ జ్యువెలరీ రంగంపై మాట్లాడిన షా.. ల్యాబ్ గ్రోన్ డైమండ్ల మార్కెట్ భవిష్యత్తులో ప్రస్తుత వజ్రాల మార్కెట్ కంటే దాదాపు 50 రెట్లు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ రంగానికి సం బంధించిన మొత్తం వ్యవస్థ భారతీయుల నియంత్రణలో ఉండేలా పరిశ్రమ నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.

# ఎంపీ సీఎం పదవికి రాజీనామా..!

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు వ్యంగ్యంగా ప్రకటించడం రాజకీయ వివాదానికి దారితీసింది. బాలాఘాట్ జిల్లాలో అంటువ్యాధులతో గిరిజన చిన్నారులు మృతి చెందిన కుటుంబాలను కలిసేందుకు ఆయన శనివారం ఆదోరి, కోర్కా, బొండారి గ్రామాలకు వెళ్లారు. అక్కడి ఆరోగ్య సదుపాయాలను పరిశీలించారు. అయితే బాధిత ప్రాంతానికి వెళ్లడంలో ఆలస్యం ఎందుకు చేశారంటూ కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆయనను ప్రశ్నించారు. వైరల్‌గా మారిన వీడియోలో ఓ మహిళ కారులో వెళు తున్న దీప్కేను అడ్డుకుని, "మృతదేహాలపై రాజకీయాలు చేసేందుకే వచ్చారా?" అంటూ ప్రశ్నించినట్లు కనిపించింది. ఆలస్యంపై దీప్కే క్షమాపణలు చెప్పినట్లు వీడియోలో వినిపించింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆయనతో ఉన్న సీజేపీ కార్యకర్తలు మరో వాహనంలోకి తీసుకెళ్లారు. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే దీప్కే సోషల్ మీడియా వేదికగా "మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా తక్షణమే రాజీనామా చేస్తున్నాను" అంటూ ఓ నకిలీ రాజీనామా లేఖను పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తనకు సీఎం పదవి ఇచ్చినట్లుగా వ్యంగ్యంగా పేర్కొంటూ, ప్రజలకు సేవ చేయడంలో తాను విఫలమయ్యానని రాశారు. సాగర్ కల్తీ మద్యం విషాదం, బాలాఘాట్ గిరిజన చిన్నారుల మరణాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ సీఎం మోహన్ యాదవ్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకు న్నారు. సీజేపీ ప్రతినిధి ఆశుతోష్ రంకా సైతం దీప్కే బాధ్యతల నుంచి పారిపోతున్నారన్న వ్యంగ్య వ్యాఖ్య చేశారు. అయితే ప్రభుత్వ లెటర్‌హెడ్‌ను ఉపయోగించి ముఖ్యమంత్రిగా తప్పుడు ప్రకటన చేశారంటూ కొందరు సోషల్ మీడియా వినియోగదారులు విమర్శించారు. బీజేపీకి చెందినట్లు చెప్పుకున్న ఓ ఖాతా దీప్కేపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేసింది. బాలాఘాట్ ఘటన వెనుక అసలు సమస్య మాత్రం గిరిజన చిన్నారుల మరణాలే. ఈ ప్రాంతంలో 30 మందికి పైగా చిన్నారులు మృతి చెందిన ఘటనపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఈ నేపథ్యంలో దీప్కే పర్యటన, ఇన్‌ఫ్లుయెన్సర్లతో జరిగిన వాగ్వాదం, ఆయన వ్యంగ్య రాజీనామా ప్రకటన చర్చనీయాంశంగా మారాయి. గ్రామానికి బయటి ప్రాంతాల నుంచి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు రావడంపై స్థానిక పాత్రికేయులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



# వ్యాధి వచ్చాక కాదు.. ముందే మేల్కొందాం!

## డయాలసిస్ బారిన పడకుండా కాపాడుకుందాం.. క్రియాటినిన్ నార్మల్ అంటే కిడ్నీలు సేఫేనా?

## జాగ్రత్తలతో ప్రాణాలు కాపాడుకునే ఫార్ములా?

కిడ్నీ వ్యాధి చివరి దశలో కనిపించే డయాలసిస్ గురించి భయపడటం కంటే, ఆ దశకు వెళ్లకుండా ముందే జాగ్రత్తపడటం అత్యంతముఖ్యం. చాలా మందికి కిడ్నీ సమస్య అంటే వెంటనే డయాలసిస్ గుర్తుకొస్తుంది. కానీ వాస్తవానికి డయాలసిస్ అవసరం ఏర్పడే సమయానికి కిడ్నీ పనితీరు గణనీయంగా తగ్గిపోయి ఉంటుంది. అంటే వ్యాధి ప్రయాణం అప్పటికే చాలా ముందుకు వెళ్లినట్టే. కిడ్నీలు దెబ్బతినే ప్రక్రియ మాత్రం అంతకుముందే ప్రారంభమై ఉండొచ్చు. ముఖ్యంగా "నా క్రియాటినిన్ సాధారణంగానే ఉంది.. కాబట్టి నా కిడ్నీలు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నాయి" అనుకోవడం సరైనది కాదు. కిడ్నీ వ్యాధి ప్రారంభ దశల్లో రక్తంలోని క్రియాటినిన్ స్థాయి సాధారణంగానే కనిపించే సందర్భాలు ఉన్నాయి. అందుకే కిడ్నీ పనితీరును అంచనా వేయడానికి క్రియాటినిన్‌తో పాటు ఈజీఎఫ్ఆర్ అనే కిడ్నీ వడపోత సామర్థ్య సూచికను పరిశీలించాలి. అలాగే మూత్రంలో ఆల్బుమిన్ ఎంత బయటకు వస్తుందో తెలుసుకునే ఏసీఆర్ పరీక్ష కూడా కీలకం. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, కుటుంబంలో కిడ్నీ వ్యాధి చరిత్ర ఉన్నవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. మధుమేహం కిడ్నీలకు నిశ్శబ్ద శత్రువు. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువకాలం అదుపులో లేకపోతే కిడ్నీలోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతింటాయి. మొదట్లో నొప్పి ఉండక పోవచ్చు. ఎలాంటి ప్రత్యేకమైన ఇబ్బంది కనిపించక పోవచ్చు. కానీ మూత్రంలో ఆల్బుమిన్ బయటకు రావడం ప్రారంభం కావచ్చు. ఇది కిడ్నీ దెబ్బతినే ప్రారంభ సంకేతాల్లో ఒకటి. అందుకే "నాకు ఎలాంటి లక్షణాలు లేవు" అనే కారణంతో కిడ్నీ పరీక్షలను వాయిదా వేయకూడదు. అలాగే అధిక రక్తపోటు కిడ్నీలపై నిరంతర ఒత్తిడిని కలిగిస్తుంది. మరోవైపు కిడ్నీ వ్యాధి కూడా రక్తపోటును పెంచుతుంది. ఇలా రెండూ ఒక దానిని మరొకటి తీవ్రం చేసే పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల రక్తపోటును నియంత్రించడం గుండెపోటు, పక్షవాతం నివారణకు మాత్రమే కాదు.. కిడ్నీలను కాపాడుకోవడానికి కూడా అత్యంత అవసరం.

### కొత్త చికిత్సలు.. కిడ్నీని కాపాడే అవకాశం!

కిడ్నీ వైద్యంలో ఇటీవలి సంవత్సరాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. గతంలో కిడ్నీ పనితీరు బాగా తగ్గిన తర్వాత చికిత్స చేయడంపైనే ఎక్కువ దృష్టి ఉండేది. ఇప్పుడు కిడ్నీ పనితీరు మరింత దిగజాకుండా ముందుగానే అడ్డుకోవడంపై వైద్యులు ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. ఈ మార్పుల్లో ఎస్‌జీఎల్‌టీ-2 నిరోధకాలు అనే మందులకు ప్రత్యేక స్థానం ఉంది. మొదట ఇవి మధుమేహం నియంత్రణకు ఉపయోగించే మందులుగా విస్తృతంగా గుర్తింపు పొందాయి. అయితే తరువాత జరిగిన పరిశోధనల్లో కొన్ని రకాల కిడ్నీ వ్యాధులతో బాధప డుతున్న వారికి ఇవి కిడ్నీ పనితీరు క్షీణతను నెమ్మదింపజేయడంలో ఉపయోగపడతాయని, గుండెకు కూడా రక్షణ కల్పించే ప్రయోజనాలు ఉండవచ్చని వెల్లడైంది. ప్రస్తుతం తగిన దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ఉన్న కొంతమంది రోగుల్లో, మధుమేహం ఉన్నా లేకపోయినా, రోగి పరిస్థితిని బట్టి ఈ మందులను వైద్యులు పరిగణిస్తున్నారు. అయితే ఒకరికి ఉపయోగపడే మందు ప్రతి ఒక్కరికీ సరిపోదు. కిడ్నీ పనితీరు స్థాయి, మూత్రంలో ఆల్బుమిన్ పరిమాణం, మధుమేహం, రక్తపోటు, గుండె సమస్యలు, ఇతర అనారోగ్యాలు, ఇప్పటికే వాడుతున్న మందులు వంటి అనేక అంశాలను పరిశీలించిన తర్వాతే చికిత్స నిర్ణయించాలి. అందువల్ల ఈ మందులను స్వయంగా ప్రారంభించడం, నిలిపివేయడం చేయకూడదు. నెఫ్రాలజిస్ట్ సూచనతోనే మందుల వాడకం ఉండాలి. మరో ముఖ్యమైన విషయం కిడ్నీ వ్యాధి ఉన్నప్పుడు నొప్పి తప్పనిసరిగా ఉండదు. కాళ్లలో వాపు, ముఖం వాపు, మూత్రంలో ఎక్కువ నురుగు, మూత్ర పరిమాణంలో మార్పులు, రక్తపోటు పెరగడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. అయితే ఇవి కనిపించే సమయానికి వ్యాధి కొంత ముందుకు వెళ్లి ఉండే అవకాశం ఉంది. అందుకే లక్షణాలు వచ్చే వరకు ఎదురుచూడటం కంటే ప్రమాదం ఉన్నవారు ముందుగానే పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. కిడ్నీ ఆరోగ్యానికి నొప్పి లేకపోవడం ఒక్కటే సర్టిఫికెట్ కాదు. ఇదే విషయాన్ని ప్రజలు ముఖ్యంగా గుర్తుంచుకోవాలి.

### డిటాక్స్ కాదు.. రోజువారీ జాగ్రత్తలే రక్షణ!

కిడ్నీలను శుభ్రం చేయడానికి ప్రత్యేకమైన డిటాక్స్ పానీయాలు, మూలికా ఉత్పత్తులు, తెలియని ఆరోగ్య సప్లిమెంట్లు అవసరమని ప్రచారం జరుగుతోంది. అయితే కిడ్నీలను ప్రత్యేకంగా "శుభ్రం చేసే" పానీయాలు ఉన్నాయని బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. నిజమైన కిడ్నీ సంరక్షణ చాలా సాధారణమైన అలవాట్లతోనే మొదలవుతుంది. రక్తపోటును నియంత్రణలో ఉంచడం, మధుమేహాన్ని అదుపులో పెట్టడం, ఉప్పు అధికంగా తీసుకోకుండా ఉండటం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, తగినంత నీరు తీసుకోవడం, అవసరం లేని మందులను స్వయంగా వాడకపోవడం ముఖ్యమైనవి. ముఖ్యంగా కొన్ని రకాల నొప్పి నివారణ మందులను తరచుగా, వైద్యుల సలహా లేకుండా వాడటం కిడ్నీలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే మందుల విషయంలో కూడా జాగ్రత్త అవసరం. డయాలసిస్ భయం కంటే వ్యాధిని ఆలస్యంగా గుర్తించడమే అసలు ప్రమాదం. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి, దానికి కారణమైన మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను నియంత్రించి, అవసరమైన చికిత్స తీసుకుంటే వ్యాధి పురోగతిని నెమ్మదింపజేసే అవకాశాలు నేడు గతంతో పోలిస్తే మెరుగయ్యాయి. ముఖ్యంగా మధుమేహం లేదా అధిక రక్తపోటు ఉన్న ప్రతి వ్యక్తి తన వైద్యుడిని మూడు ప్రశ్నలు అడగాలి: "నా ఈజీఎఫ్ఆర్ ఎంత?" "నా మూత్ర ఏసీఆర్ ఎంత?" "భవిష్యత్తులో నా కిడ్నీలకు ప్రమాదం ఎంత?" ఈ మూడు ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడం ద్వారా కిడ్నీ ఆరోగ్యంపై స్పష్టమైన అవగాహన వస్తుంది. అవసరమైతే తదుపరి పరీక్షలు, చికిత్సను ముందుగానే ప్రారంభించవచ్చు.

కిడ్నీలు మన శరీరంలో నిశ్శబ్దంగా పనిచేసే అత్యంత కీలకమైన అవయవాలు. అవి సమస్యను చాలాసార్లు గట్టిగా చెప్పవు. కాబట్టి లక్షణాలు వచ్చే వరకు వేచి ఉండకండి. ఈరోజే రక్తపోటును పరీక్షించుకోండి. ఈరోజే మధుమేహాన్ని నియంత్రించండి. అవసరమైతే ఈరోజే కిడ్నీ పరీక్షలు చేయించుకోండి. డయాలసిస్ అవసరం వచ్చే దశ గురించి ఆలోచించే రోజు వరకు ఎదురుచూడాల్సిన అవసరం లేదు. కిడ్నీని కాపాడుకోవడంలో అత్యుత్తమ మార్గం వ్యాధి వచ్చిన తర్వాత పోరాడటం కాదు.. వ్యాధి ముందే గుర్తించి, సమయానికి జాగ్రత్త పడటమే.



కళాశికం క్రాంతి కుమార్
ఎండీ. డీఎం, సీనియర్ కన్సల్టెంట్
ఏఐఎన్‌యూ, హైటెక్ సిటీ, హైదరాబాద్



# బ్రిక్స్‌లో భారత్ దౌత్య విజయం

## ఒకే వేదికపై మోదీ, పుతిన్, జిన్‌పింగ్

న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రధాని నరేంద్ర మోదీ మధ్యలో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా ఇతర దేశాధినేతలు ఇరువైపులా నిలిచిన 'బ్రిక్స్ ఫ్యామిలీ ఫొటో' ప్రత్యేక ఆకర్షణగా మారింది. భారత్, చైనా, రష్యా, ఇరాన్ సహా 11 దేశాల నేతలు ఒకే వేదికపైకి రావడం అంతర్జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో అగ్రదేశాల నేతలు కలిసి చర్చలు జరపడం బ్రిక్స్ ప్రాధాన్యతను మరోసారి చాటింది.

### మధ్యప్రాచ్యంపై ఏకాభిప్రాయం

సమ్మిట్‌లో అత్యంత కీలక పరిణామంగా మధ్య ప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై బ్రిక్స్ దేశాలు సంయుక్త ప్రకటన చేయడం నిలిచింది. ఇంతకు ముందు మంత్రుల స్థాయి సమావేశంలో యుద్ధ అంశంపై దేశాల మధ్య విభేదాలు తలెత్తడంతో సంయుక్త ప్రకటన వెలువడలేదు. భారత్ దౌత్య ప్రయత్నాలతో నేతల సమావేశం నాటికి పరిస్థితి మారింది. మధ్య ప్రాచ్య ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన బ్రిక్స్ దేశాలు గరిష్ఠ సంయమనం పాటించాలని, పరిస్థితిని మరింత దిగజార్చే చర్యలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా మధ్య ప్రాచ్య యుద్ధం అంతర్జాతీయ సమాజం ఉమ్మడి ప్రయోజనాలకు అనుకూలం కాదని స్పష్టం చేశారు. చివరగా 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు మోదీ ప్రకటించారు.

### ఉగ్రవాదంపై కఠిన వైఖరి

బ్రిక్స్ ప్రకటనలో ఉగ్రవాదంపై కూడా గట్టి సందేశం వెలువడింది. ఉగ్రవాదానికి అన్ని రూపాల్లోనూ వ్యతిరేకమని, సరిహద్దులు దాటి జరిగే ఉగ్ర కార్యకలాపాలు, ఉగ్రవాద నిధులు, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే వ్యవస్థలపై కఠిన చర్యలు అవసరమని సభ్య దేశాలు స్పష్టం చేశాయి. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని కూడా ప్రకటన ప్రత్యేకంగా ఖండించింది. ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని కొనసాగించాలని, ఐక్యరాజ్యసమితి సమగ్ర ఉగ్రవాద వ్యతిరేక సదస్సు త్వరగా అమల్లోకి రావాలని కోరాయి. వాణిజ్య రంగంలో ఏకపక్ష సుంకాలు, సుంకేతర ఆంక్షలు ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీస్తున్నాయని బ్రిక్స్ ఆందోళన వ్యక్తం చేసింది. డబ్ల్యూటీవో ఆధారిత బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను బలోపేతం చేయాలని, ఏకపక్ష ఆర్థిక ఆంక్షలకు ముగింపు పలకాలని పిలుపునిచ్చింది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్ 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టైనబిలిటీ' అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఈ ఏకాభిప్రాయం మోదీ దౌత్యానికి కీలక విజయంగా నిలిచింది.

# యుద్ధం వద్దు.. శాంతి ముద్దు

## ఇరాన్-యూఏఈ మధ్య కొత్త దౌత్యం

## గల్ఫ్ దేశాల్లో మారుతున్న వైఖరి

## భారత్ వేదికగా శాంతి సంకేతాలు



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్, యూఏఈ మధ్య దౌత్య సంబంధాల్లో కీలక మార్పు కనిపించింది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా న్యూఢిల్లీలో యూఏఈ అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్ బిన్ జాయెద్‌తో భేటీ అయిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్.. మరుసటి రోజు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్-యూఏఈ మధ్య చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని, గతాన్ని పక్కన పెట్టి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలనే అంగీకారం కుదిరిందని ఆయన తెలిపారు. "ముందుకు చూద్దాం.. భవిష్యత్తును కలిసి నిర్మిద్దాం" అనే సందేశం ఇరాన్ వైఖరిలో మార్పును సూచించింది. యుద్ధ పరిస్థితుల్లో రెండు దేశాల మధ్య అత్యున్నత స్థాయి సంప్రదింపులు జరగడం ప్రాంతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

### హర్మూజ్‌పై చర్చలకు ట్రంప్ గ్రీన్‌సిగ్నల్

ఇదే సమయంలో గల్ఫ్ దేశాలు ఇరాన్‌తో హర్మూజ్ జలసంధి భవిష్యత్తుపై చర్చలు జరపడం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. గల్ఫ్ దేశాలు ఇరాన్‌తో సమావేశమవ్వడంపై తనకు అభ్యంతరం లేదని, అది ఆయా దేశాల నిర్ణయమని ట్రంప్ స్పష్టం చేశారు. భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడం, మధ్యప్రాచ్యంలో పరిస్థితులను చక్కదిద్దడం లక్ష్యంగా ఒమన్‌లో గల్ఫ్ దేశాలు, ఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. ప్రపంచ చమురు సరఫరాలో గతంలో దాదాపు ఐదో వంతు చమురు రవాణా జరిగిన హోర్ముజ్ జలసంధిపై ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆందోళన కలిగిస్తున్నాయి. గత నెలలో ఇరాన్‌తో వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపి వేస్తున్నట్లు యూఏఈ ప్రకటించిన నేపథ్యంలో తాజా దౌత్య చర్చలు మరింత ప్రాధాన్యత పొందాయి.

### అమెరికా స్థావరాలపైనే ఇరాన్ అభ్యంతరం

ఇరాన్‌కు యూఏఈతో ఎలాంటి ప్రత్యక్ష సమస్య లేదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాల నుంచే ఇరాన్‌పై దాడులు జరుగుతున్నాయన్నదే తమ అభ్యంతరమని ఆయన పేర్కొన్నారు. యూఏఈతో పాటు ప్రాంతీయ దేశాలను ఇరాన్ సోదర దేశాలుగా భావిస్తోందని, చాలా కాలంగా వాణిజ్య సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. తమ భూభాగాన్ని పొరుగు దేశాలపై దాడులకు ఉపయోగించకుండా స్నేహ దేశాలు జాగ్రత్త వహించాలని సూచించారు.

### బ్రిక్స్ నుంచి శాంతి పిలుపు

ఈ పరిణామాల మధ్య బ్రిక్స్‌లోని 11 దేశాలు న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026ను ఏకగ్రీవంగా ఆమోదించి.. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. గరిష్ఠ సంయమనం పాటించాలని, సంభాషణ, దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చాయి. పౌరులు, పౌర మౌలిక వసతుల రక్షణతో పాటు అంతర్జాతీయ వాణిజ్యం, సరఫరా వ్యవస్థలు, ఇంధన రవాణా నిరంతరంగా కొనసాగాల్సిన అవసరాన్ని కూడా బ్రిక్స్ దేశాలు స్పష్టం చేశాయి.



# మోదీ-జిన్‌పింగ్ భేటీ

## చైనా సంబంధాల్లో కదలిక

## సరిహద్దు శాంతికి ఇరుదేశాల హామీ

## వ్యూహాత్మక సంబంధాలపై కీలక చర్చలు

న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు వేళ ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ అయ్యారు. 2025 ఆగస్టులో తియాంజిన్‌లో జరిగిన సమావేశం తరువాత ఇద్దరు నేతలు మరోసారి ముఖాముఖి చర్చలు జరిపారు. భారత్-చైనా సంబంధాల్లో క్రమంగా పురోగతి కనిపిస్తోందని ఇద్దరు నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృష్టితో ముందుకు తీసుకెళ్లాలని అంగీకరించారు. విభేదాలు వివాదాలుగా మారకూడదన్న అంశంపై ఇరువురు నేతలు స్పష్టమైన వైఖరి వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది చైనా బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో జిన్‌పింగ్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

### సరిహద్దులో శాంతే కీలకం

భారత్-చైనా సంబంధాల భవిష్యత్తుకు సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత అత్యంత కీలకమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. సరిహద్దు సమస్యకు న్యాయబద్ధమైన, సముచితమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనాల్సిన అవసరాన్ని ఇరుదేశాలు పునరుద్ఘాటించాయి. ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధితోపాటు సరిహద్దు సమస్య పరిష్కారాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని చైనా కూడా పేర్కొంది. 2020 గల్వాన్ ఘర్షణల తరువాత చల్లబడిన సంబంధాల్లో గత రెండేళ్లుగా క్రమంగా మార్పు కనిపిస్తోంది. కైలాస్ మానసరోవర్ యాత్ర పునఃప్రారంభం, ప్రజల మధ్య సంబంధాల పెరుగుదల, హిమాలయ మార్గాల్లో సరిహద్దు వాణిజ్యం మెరుగుపడటం ఈ మార్పుకు సంకేతాలుగా నిలిచాయి. 2024 కజాన్ బ్రిక్స్ సమావేశం, 2025 తియాంజిన్ ఎస్‌సీవో సదస్సు తరువాత తాజా మోదీ-జిన్‌పింగ్ భేటీ కూడా ఇదే దౌత్య పయనానికి కొనసాగింపుగా కనిపించింది.

### గ్లోబల్ సౌత్‌లో భారత్-చైనా పాత్ర

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధంపైనా జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మధ్య ప్రాచ్య యుద్ధం ప్రాంతంలోని ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తోందని, అంతర్జాతీయ సమాజం ఉమ్మడి ప్రయోజనాలకు ఇది విరుద్ధమని ఆయన అన్నారు. సంక్షోభానికి రాజకీయ పరి ష్కారం అవసరమని చైనా స్పష్టం చేసింది. బ్రిక్స్ దేశాలతో కలిసి మధ్యప్రాచ్యంలో శాంతి కోసం తగిన పాత్ర పోషిస్తామని జిన్‌పింగ్ తెలిపారు. భారత్, చైనాలను గ్లోబల్ సౌత్‌లో కీలక దేశాలుగా, ప్రపంచ వ్యవహారాల్లో ముఖ్యమైన బాధ్యతలు కలిగిన దేశాలుగా ఆయన అభివర్ణించారు. ఐక్యరాజ్యసమితి, ఎస్‌సీఓ, బ్రిక్స్, జీ20 వంటి వేదికల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని సూచించారు. విభిన్న జాతీయ పరిస్థితులు ఉన్నప్పటికీ ఒకరి బలాల నుంచి మరొకరు నేర్చుకోవడం, పరస్పర ప్రయోజనాలతో సహకారం, పరస్పర గౌరవం, బహుపాక్షిక వ్యవస్థలో భాగస్వామ్యం ద్వారా సంబంధాలను స్థిరంగా ముందుకు తీసుకెళ్లాలని జిన్‌పింగ్ ప్రతిపాదించారు. దీంతో మోదీ-జిన్‌పింగ్ భేటీ భారత్-చైనా సంబంధాల్లో కొత్త దౌత్య సమీకరణాలకు సంకేతంగా నిలిచింది.

### మైదాన గిరిజనులకు రాజకీయ న్యాయం కల్పించాలి



మైదాన ప్రాంత గిరిజనులు, లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రాజకీయ న్యాయం చేయాలని బంజారా సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చట్టసభల్లో మైదాన ప్రాంత గిరిజనులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, రాబోయే డీలిమిటేషన్‌లో పెరిగే గిరిజన స్థానాల్లో ఈ ప్రాంతానికి తగిన వాటా కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో జిల్లా యూనిట్‌గా గిరిజన రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు మంత్రివర్గంలో లంబాడీ సమాజానికి ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డుకు సంబంధించిన జీఓ 641ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీలో 20 ఎకరాల్లో సేవాలాల్ మహారాజ్ మందిరం నిర్మించాలని, మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ తరహా ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని, లక్ష్మీదేవ్‌పూర్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.కోటి పరిహారం చెల్లించాలని తిరుపతి నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

### రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి బికియూ డిమాండ్

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారతీయ కిసాన్ యూనియన్ (బికియూ) డిమాండ్ చేసింది. ఆదివారం గోపాల్‌పేట మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో బికియూ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వి.సుబ్బయ్య ముఖ్య అతిథిగా పాల్గొని, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేల పరిహారం అందించాలని, 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వారం రోజుల్లో పంట రుణమాఫీ పూర్తి చేయాలని, రైతుల భూముల్లో అక్రమంగా వేసిన గెట్లను తహసీల్దార్ల ద్వారా తొలగించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గోపాల్‌పేట మండల బికియూ నూతన అధ్యక్షుడిగా ధన్వాడ నాగరాజు, కార్యదర్శిగా బాలస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సదస్సుకు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# రాజకీయ దూరం..

## బ్రిక్స్ భేటీకి విపక్ష సీఎంల దూరం

## బీజేపీ సీఎంల హాజరుతో కొత్త చర్చ

న్యూఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన బ్రిక్స్ సదస్సు ముగిసే సమయానికి రాజకీయంగా మరో అంశం చర్చనీయాంశమైంది. విపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశానికి హాజరుకాలేదు. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆహ్వానాలు అందినప్పటికీ కేరళకు చెందిన వి.డి. సతీశన్, తమిళనాడుకు చెందిన విజయ్, కర్ణాటక డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు సమావేశానికి దూరంగా ఉన్నారు. వీరి గైర్హాజరుపై అధికారికంగా ఎలాంటి కారణం వెల్లడికాలేదు. అయితే తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ వర్గాల సమాచారం ప్రకారం రేవంత్‌రెడ్డి, సుఖు ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల కారణంగా ఢిల్లీ సమావేశానికి వెళ్లలేకపోయారు.

### బీజేపీ సీఎంల సందడి

విపక్ష ముఖ్యమంత్రులు దూరంగా ఉన్న సమయంలో బీజేపీ పాలిత ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బ్రిక్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన విందుకు హాజరయ్యారు. అయితే విపక్షాలు ఇలాంటి కేంద్ర స్థాయి సమావేశాలకు దూరంగా ఉండటం ఇదే తొలిసారి కాదు. 2024 జూలైలో జరిగిన నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని కూడా పలువురు విపక్ష ముఖ్యమంత్రులు బహిష్కరించారు. కేంద్ర బడ్జెట్‌లో ఎన్డీయేతర రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ అప్పట్లో కాంగ్రెస్ సీఎంలతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు నేతలు సమావేశానికి దూరంగా ఉన్నారు. 2023లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన జీ20 విందుకు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు గైర్హాజరైన విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది.

### బ్రిక్స్ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ విమర్శలు

ముఖ్యమంత్రుల గైర్హాజరుతో పాటు బ్రిక్స్ సదస్సు ఫలితాలపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. ఢిల్లీ డిక్లరేషన్ అంచనాలకు తగ్గ స్థాయిలో లేదని, అరుణాచల్‌ప్రదేశ్, లడఖ్ అంశాలతో పాటు పహల్గామ్ ఉగ్రదాడిపై స్పష్టమైన ప్రస్తావన లేకపోవడం సదస్సును విజయంగా చెప్పలేని పరిస్థితిని చూపుతోందని కాంగ్రెస్ పేర్కొంది. చైనా అరుణాచల్, లడఖ్ ప్రాంతాల్లో ఆక్రమణలకు పాల్పడుతోందని ఆరోపించిన కాంగ్రెస్ నేత నానా పటోలే.. ప్రధాని మోదీ చైనాను నేరుగా ప్రశ్నించి ఆక్రమిత ప్రాంతాల నుంచి వెనక్కి వెళ్లాలని డిమాండ్ చేయాల్సిందని అన్నారు. మరో కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ కూడా ఢిల్లీ డిక్లరేషన్‌లో ఉగ్రవాదాన్ని, పహల్గామ్ ఘటనను ఖండించినా దాడి చేసింది ఎవరో, ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ఎవరు ప్రోత్సహిస్తున్నారో స్పష్టంగా పేర్కొనలేదని విమర్శించారు. దీంతో బ్రిక్స్ సదస్సు అంతర్జాతీయ దౌత్యంతో పాటు దేశీయ రాజకీయాల్లోనూ చర్చకు కేంద్రంగా మారింది.

# చైనా విషయంలో రాజీ ఎందుకు?

## మోదీ-జిన్‌పింగ్ భేటీపై కాంగ్రెస్ ధ్వజం

## నాలుగు ప్రశ్నలతో జైరాం రమేశ్ ఫైర్

## గాల్వాన్ - అరుణాచల్ వరకు ప్రశ్నలు



ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. భారత్-చైనా సంబంధాల్లో స్థిరమైన పురోగతి కనిపిస్తోందన్న ప్రభుత్వ వాదనను ఆ పార్టీ ప్రశ్నించింది. గాల్వాన్ ఘర్షణ, లడఖ్‌లో చైనా భూభాగ ఆక్రమణల ఆరోపణలు, అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా హక్కుల వాదన, పాకిస్థాన్‌కు చైనా మద్దతు వంటి అంశాలను ప్రస్తావించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రధాని మోదీకి నాలుగు ప్రశ్నలు సంధించారు. 2020 గాల్వాన్ ఘర్షణలో 20 మంది భారత సైనికులు మరణించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అప్పటి అఖిలపక్ష సమావేశంలో "భారత భూభాగంలోకి ఎవరూ రాలేదు" అన్న మోదీ వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోవడం వల్ల చైనాతో తదుపరి చర్చల్లో భారత్ చర్చల స్థానం బలహీనపడిందని రమేశ్ ఆరోపించారు.

**సరిహద్దు, పాక్ మద్దతుపై నిలదీత**

తూర్పు లడఖ్‌లో సంప్రదాయ గస్తీ, మేత హక్కులను భారత్ కోల్పోయిందని కాంగ్రెస్ ఆరోపించింది. అరుణాచల్‌లో చైనా చొరబాట్లు, ప్రాంతాల పేర్ల మార్పు, బ్రహ్మపుత్రపై మెడోగ్ భారీ డ్యామ్ నిర్మాణ ప్రతిపాదనపై కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ఈశాన్య భారత జల భద్రతకు ముప్పుగా మారవచ్చని పేర్కొంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా అందించిన సహకారంపై భారత వైఖరి ఎందుకు మారిందని ప్రశ్నించింది. ఆర్థిక రంగంలోనూ చైనాపై ఆధారపడటం పెరిగిందని కాంగ్రెస్ విమర్శించింది. 2025-26లో చైనాతో భారత్ వాణిజ్య లోటు రికార్డు స్థాయిలో 112.6 బిలియన్ డాలర్లకు చేరిందని పేర్కొంది. కీలక ముడి పదార్థాలు, తయారీ భాగాల కోసం చైనా దిగుమతులపై ఆధారపడటం దేశీయ పరిశ్రమలు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకు నష్టం చేస్తోందని తెలిపింది. "మేక్ ఇన్ ఇండియా"కు సమాంతరంగా చైనా దిగుమతులు పెరగడం విరుద్ధ పరిస్థితిని సృష్టిస్తోందని రమేశ్ వ్యాఖ్యానించారు. చైనాతో సంబంధాల సాధారణీకరణ వేరు, "క్యాలిబ్రేటెడ్ క్యాపిట్యులేషన్" వేరు అంటూ మోదీ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.



# వర్షం లేకున్నా ప్రకృతి వ్యవసాయంలో మంచి దిగుబడి

వేంపల్లి మండలం నందిపల్లిలో నిర్వహించిన పంట కోత ప్రయోగంలో ప్రకృతి వ్యవసాయం సత్తా చాటింది. గ్రామానికి చెందిన గంగిరెడ్డి పీఎండీఎస్ పొలంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో 30 రకాల విత్తనాలను విత్తన గుళికలుగా తయారు చేసి, వర్షాలు లేకున్నా 45 రోజులపాటు సాగు చేశారు. అనంతరం 5ఐ5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 65.850 కిలోల బయోమాస్ దిగుబడి లభించింది. దీని ఆధారంగా ఎకరానికి సుమారు 9 నుంచి 10 టన్నుల బయోమాస్ వస్తుందని సిబ్బంది తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు తక్కువ ఖర్చుతో సాగు, మంచి దిగుబడి, పశువులకు మేత లభిస్తాయని రైతు గంగిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లి మండలంలో 450 మంది రైతులతో చీని, నిమ్మ, అరటి, వరి, కూరగాయల పంటల్లో ముందుగా పీఎండీఎస్ చేయించి, అనంతరం ప్రధాన పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ప్రయోగంలో గంగిరెడ్డి, ఈశ్వరమ్మ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



# కడపలో 20న ఆప్ రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం

ఈనెల 20న కడప జిల్లాలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ సాజిద్ హుస్సేన్ తెలిపారు. రాష్ట్ర కన్వీనర్ శిర రమేష్ కుమార్‌తో పాటు రాష్ట్ర పార్టీ బృందం సమావేశానికి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసేవపై ఆసక్తి ఉన్నవారు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేటర్, కౌన్సిలర్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే దిశగా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సూచించారు.?

ఎన్నికల సన్నద్ధత, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నట్లు సాజిద్ హుస్సేన్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ బేరిలా శ్రీనివాసులు, జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా కార్యదర్శి ఫైజ్ దస్తగిరి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి షరీఫ్, జిల్లా యూత్ వింగ్ ఆరిఫ్, వేంపల్లి ఆప్ సభ్యులు మహమ్మద్ గౌస్, అల్లాబక్ష, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎన్నికలపై పార్టీ భవిష్యత్

# బ్రిక్స్‌కు మోదీ కొత్త దిశానిర్దేశం

**టెక్నాలజీని ఆయుధంగా మార్చొద్దు**

**ఆలోచన కాదు.. ఆచరణతోనే ఫలితాలు**





బ్రిక్స్ సదస్సు రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక హెచ్చరిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలు, ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, వాటి ప్రభావం సామాన్య ప్రజల జీవితాలపై తీవ్రంగా పడుతోందని పేర్కొన్నారు. సాంకేతికత, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చడం ప్రపంచ దేశాల ఉమ్మడి అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని హెచ్చరించారు. టెక్నాలజీ ప్రయోజనాలు అన్ని దేశాలకు సమానంగా అందేలా సమగ్ర విధానం అవసరమని చెప్పారు. మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరా గొలుసుల అంతరాయాలు.. ప్రపంచం పరస్పరం అనుసంధానమై ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఏ సంక్షోభమూ ఒక్క ప్రాంతానికే పరిమితం కాదని గుర్తుచేశారు. అందుకే సంక్షోభాలను ముందుగానే గుర్తించడం, సిద్ధంగా ఉండటం, వేగంగా స్పందించడం ద్వారా బ్రిక్స్ దేశాలు స్థిరత్వాన్ని పెంచుకోవాలని మోదీ సూచించారు.

**ఆరోగ్యం నుంచి సరఫరా గొలుసుల వరకు**

సంక్షోభాలపై ముందస్తు చర్యలకు బ్రిక్స్ దేశాలు పలు కీలక కార్యక్రమాలకు అంగీకరించాయని మోదీ వెల్లడించారు. అంటువ్యాధులను ముందుగానే గుర్తించి స్పందించేందుకు బ్రిక్స్ ఇంటిగ్రేటెడ్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విపత్తుల నిర్వహణకు ముందస్తు హెచ్చరిక సమాచారాన్ని సమన్వయం చేసే మార్గదర్శకాలు సిద్ధం చేశారు. బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సరఫరా వ్యవస్థలను మరింత నమ్మదగినవిగా, స్థిరంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్టార్టప్‌ల కోసం బ్రిక్స్ ఇన్‌క్యుబేటర్ నెట్‌వర్క్, బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ప్రతిపాదించారు. డిజిటల్ వ్యవసాయ నెట్‌వర్క్ ద్వారా ఏఐ, భౌగోళిక సమాచార సాంకేతికత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను రైతుల అవసరాలతో అనుసంధానించనున్నారు. బ్రిక్స్ కనెక్ట్ ద్వారా నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, మహిళల ఉద్యోగ భాగస్వామ్యం, సామాజిక భద్రత, సామర్థ్య పెంపుపై దృష్టి పెట్టనున్నారు.

**మూడో దశాబ్దంలో ఫలితాలే ముఖ్యం**

చిన్న పరిశ్రమలకు జ్ఞానం, ఆర్థిక వనరులు, కొత్త మార్కెట్లను అందించేందుకు బ్రిక్స్ ఎంఎస్ఎంఈ కోఆపరేషన్ పోర్టల్ ప్రారంభించామని మోదీ తెలిపారు. నగరాల మధ్య ఉత్తమ విధానాల మార్పిడికి బ్రిక్స్ అర్బన్ మొబిలిటీ హబ్‌ను ఏర్పాటు చేశారు. స్వచ్ఛ ఇంధన వ్యవస్థలను బలోపేతం చేసేందుకు స్మార్ట్ గ్రిడ్లు, ఎనర్జీ స్టోరేజ్‌పై బ్రిక్స్ డిజిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయ పర్యావరణం, పునరుత్పాదక వ్యవసాయంపై సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతో కలపాలని నిర్ణయించారు. స్థానిక జ్ఞానాన్ని వాతావరణ మార్పులపై చర్యలకు కీలక ఆధారంగా ఉపయోగించనున్నట్లు చెప్పారు. బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్నందున ప్రపంచం కేవలం ఆలోచనలు, హామీలు కాకుండా స్పష్టమైన ఫలితాలను ఆశిస్తోందని మోదీ స్పష్టం చేశారు.

# స్తంభించింది భద్రతా మండలి

**అగ్రరాజ్యాల తీరుపై గుటెర్రస్ అసంతృప్తి**

**భారత్ మధ్యవర్తిత్వానికి యూఎన్ చీఫ్ ప్రశంసలు**



బ్రిక్స్ సదస్సు సందర్భంగా న్యూఢిల్లీలో ఉన్న ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ప్రపంచ నాయకత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఐరాస భద్రతా మండలి ప్రస్తుతం నిర్ణయాలు తీసుకునే స్థాయిలో స్తంభించిపోయిందని అన్నారు. అయితే ఐక్యరాజ్యసమితి వ్యవస్థ పూర్తిగా విఫలం కాలేదని స్పష్టం చేశారు. అగ్రరాజ్యాలు తమ శక్తికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయనే వాస్తవాన్ని గుర్తించడం లేదని విమర్శించారు. ప్రపంచ నాయకత్వంలో విభజన, జవాబుదారీతనం లేకపోవడం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి అంతర్జాతీయ వ్యవస్థను బలహీనపరుస్తోందని గుటెర్రస్ అభిప్రాయపడ్డారు.

**యుద్ధాలపై భారత్ ప్రయత్నాలకు ప్రశంస**

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ది హిందూకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో గుటెర్రస్ పలు కీలక అంశాలపై స్పందించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో భారత్ చేస్తున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. ప్రపంచ శాంతి కోసం దేశాలు చర్చలు, దౌత్య మార్గాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు, గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలు, ఐరాస సంస్కరణలు, తన వారసుడి ఎన్నిక వంటి అంశాలపై కూడా ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు.

ఐరాస మ్యాప్‌కు సంబంధించి తాజాగా తలెత్తిన వివాదం పైనా గుటెర్రస్ స్పష్టత ఇచ్చారు. ఈ ఏడాది చివర్లో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో గుటెర్రస్ వ్యాఖ్యలు అంతర్జాతీయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభాలపై ఆయన ఆందోళనను స్పష్టంగా ప్రతిబింబించాయి.

# గురుకులంలో విద్యార్థుల సౌకర్యాలపై ఎమ్మెల్సీ ఆరా



చక్రాయపేట: చక్రాయపేటలోని గురుకుల బాలుర పాఠశాలను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహం, భోజనశాలను పరిశీలించిన ఆయన విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాభ్యాసం, వసతి పరిస్థితులు, భోజన నాణ్యత, పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిబ్బందితో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్సీ తెలిపారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యం, వసతి విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి, సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని భూమి రెడ్డి రామగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ తనిఖీతో పాఠశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు.

# నేను దిమాగీ నక్సల్

**మోదీ వ్యాఖ్యపై సిబల్ సెటైర్**

**హార్స్ ట్రేడింగ్‌పై తీవ్ర విమర్శలు**



ప్రధాని నరేంద్ర మోదీ గతంలో ఉపయోగించిన 'దిమాగీ నక్సల్' పదంపై రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ వ్యంగ్యంగా స్పందించారు. ఆదివారం కొచ్చిలో 'హార్స్ ట్రేడ్ అండ్ డెమోక్రసీ' అంశంపై జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. "ఒక విషయం ఒప్పుకోవాలి.. నేను దిమాగీ నక్సల్‌ను" అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. వ్యవస్థలో చొరబడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న, విధానాలను ప్రభావితం చేస్తూ సమాజానికి ముప్పుగా మారుతున్న వ్యక్తులను 'దిమాగీ నక్సల్స్'గా మోదీ అభివర్ణించారు. అలాంటి వారిని గుర్తించి, ఒంటరిగా చేయాలని ఆయన గతంలో ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ పదాన్ని బీజేపీ తమపై రాజకీయ దాడికి ఉపయోగిస్తోందన్న విపక్ష విమర్శల నేపథ్యంలో సిబల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**హార్స్ ట్రేడింగ్.. రాజ్యాంగ సంక్షోభం**

ఎన్నికల తర్వాత ప్రజల తీర్పును మార్చేలా ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రలోభపెట్టడం ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం చేస్తుందని సిబల్ అన్నారు. హార్స్ ట్రేడింగ్ అనేది తాత్కాలిక రాజకీయ వివాదం కాదు.. రాజ్యాంగ సంక్షోభమని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో యుద్ధాల ఫలితాలను నిర్ణయించడంలో గుర్రాలకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ.. వాటి విక్రయంలో మోసపూరిత పద్ధతులు ఉండేవని చెప్పారు. ఇప్పుడు రాజకీయాల్లో పరిస్థితి మారిందని, గుర్రాల స్థానంలో ప్రజా ప్రతినిధులు, కొనుగోలుదారులే అసలు ఆటగాళ్లుగా మారారని వ్యాఖ్యానించారు. నగదు, పదవులు, దర్యాప్తుల నుంచి రక్షణ వంటి ప్రలోభాలతో ప్రజా ప్రతినిధులను కొనుగోలు చేయడం జరుగుతోందని ఆరోపించారు. కొన్నిసార్లు ఇదే ప్రక్రియను విలీనం వంటి చట్టబద్ధ రూపంలో చూపిస్తున్నారని అన్నారు. ప్రజలు ఒక పార్టీకి ఓటు వేస్తే.. అధికారాన్ని మరో రాజకీయ సమీకరణానికి అప్పగించడం ప్రజా తీర్పును వక్రీకరించడమేనని సిబల్ స్పష్టం చేశారు.



# భారత దృక్కోణంలో చరిత్రకు కొత్త స్వరం

## చరిత్ర చెరిపేయడం కాదు.. నిజాన్ని చెప్పడం

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి

దేశ చరిత్ర, జ్ఞాన సంప్రదాయాల డీకాలనైజేషన్ అంటే గతాన్ని చెరిపేయడం కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చారిత్రక వాస్తవాలను ప్రపంచానికి భారతీయ దృక్కోణంలో, ప్రామాణికంగా పరిచయం చేయడమే డీకాలనైజేషన్ లక్ష్యమని ఆయన అన్నారు. ముంబైలోని ఏషియాటిక్ సొసైటీలో మాన్యుస్క్రిప్ట్ ప్రదర్శనను ప్రారంభించిన సందర్భంగా షా మాట్లాడారు. భారతీయ జ్ఞానం, చరిత్ర, సంప్రదాయాలు, భాషలు, ప్రాచీన గ్రంథాలు, ఆర్కైవ్‌లను పరిరక్షించి దేశ ప్రజలకు, ప్రపంచానికి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వలస పాలన కాలంలో భారత జ్ఞానాన్ని వలసవాద దృక్కోణంతో అర్థం చేసుకునే ప్రయత్నాలు జరిగాయని, దాని ప్రభావంతో భారతీయుల్లో ఆత్మన్యూనత భావం పెరిగిందని ఆయన అన్నారు. బ్రిటిష్ పాలకులు జ్ఞానాన్ని అధికారంతో ముడిపెట్టారని, ఇప్పుడు ఆ వ్యవస్థ నుంచి జ్ఞానాన్ని విముక్తం చేసి భారత స్వరంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**మాన్యుస్క్రిప్ట్‌లలో అపారమైన జ్ఞానం**

ఒక దేశం తన జ్ఞాపకాలు, చరిత్ర, సంస్కృతి, భాషలు, సంప్రదాయాలు, ఆర్కైవ్‌లను కాపాడుకోలేకపోతే ఎంత శక్తివంతమైన దేశమైనా ఎక్కువకాలం నిలవదని షా పేర్కొన్నారు. భారతీయుల జ్ఞాపకాల్లో, మౌఖిక సంప్రదాయాల్లో నిక్షిప్తమైన జ్ఞానాన్ని ఎవరూ పూర్తిగా నాశనం చేయలేకపోయారని చెప్పారు. నలందా గ్రంథాలయాన్ని కాల్చివేసినా.. ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిన జ్ఞానాన్ని మాత్రం చెరిపేయలేకపోయారని ఉదాహరించారు. భారత శాస్త్ర విజ్ఞానంలో చరిత్ర, పురావస్తు, భాషాశాస్త్రం, తత్వశాస్త్రం, సాహిత్యం, మతం, వ్యాకరణం, మానవశాస్త్రం, శాసనాలు, నాణేల అధ్యయనం వంటి అనేక విభాగాలు ఉన్నాయని గుర్తుచేశారు.

ఏషియాటిక్ సొసైటీలోని మహాభారతం, జైన కల్పసూత్రం, బౌద్ధ గ్రంథాల వంటి విలువైన సంపదను విద్యార్థులు, పరిశోధకులకు అందుబాటులోకి తేవాలని సూచించారు.

మాన్యుస్క్రిప్ట్‌లను డిజిటలైజ్ చేసి దేశంలోని గ్రంథాలయాలతో అనుసంధానం చేయాలని, గ్రామాల్లో ఇళ్లలో ఉన్న పాత పత్రాలు, పూర్వీకుల దస్తావేజులను గుర్తించి జ్ఞాన్ భారత్ నేషనల్ మాన్యుస్క్రిప్ట్ మిషన్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. దేశవ్యాప్తంగా జ్ఞానాన్ని పరిరక్షించే సంస్థలన్నింటినీ ఏషియాటిక్ సొసైటీతో అనుసంధానించి ఉమ్మడి జ్ఞాన భాండాగారం ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. భారత జ్ఞాన సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు తీసుకెళ్లే ఉద్యమంలో తాను భాగస్వామినని షా పేర్కొన్నారు.

## ఆంక్షలకు చెక్..

# బ్రిక్స్‌కు కొత్త ఆర్థిక బలం

**బ్రిక్స్‌లో రష్యా కొత్త ఆర్థిక ప్రతిపాదనలు**

**అమెరికా, యూరప్ ఆంక్షలకు కౌంటర్ వ్యవస్థ**

**ధాన్య మార్కెట్, బీమాపై పుతిన్ ప్రతిపాదనలు**



న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు సమావేశంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక ఆర్థిక ప్రతిపాదనలు చేశారు. పాశ్చాత్య దేశాల ఆంక్షల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కొత్త బీమా వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ఉమ్మడి ధాన్య మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. రష్యా ప్రతిపాదించే ఈ వ్యవస్థలను బ్రిక్స్ సభ్యదేశాలు ఉపయోగించుకోవాలని ఆయన ఆహ్వానించారు.

**చమురు బీమాపై ఆంక్షల ప్రభావం**

రష్యా చమురు ఎగుమతులపై పాశ్చాత్య దేశాలు విధిస్తున్న ఆంక్షల నేపథ్యంలో పుతిన్ ప్రతిపాదనకు ప్రాధాన్యం ఏర్పడింది. జీ7, యూరోపియన్ యూనియన్, బ్రిటన్ రష్యా చమురును నిర్ణీత ధర పరిమితిలోపు కొనుగోలు చేసినప్పుడు మాత్రమే నౌకలకు బీమా అందేలా ఆంక్షలు విధించాయి. దీంతో అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రత్యామ్నాయ బీమా వ్యవస్థ అవసరం ఏర్పడిందని రష్యా భావిస్తోంది. బ్రిక్స్ దేశాల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. పెట్టుబడులు, వాణిజ్యం, సాంకేతికత, మార్కెట్ల మధ్య సహకారాన్ని పెంచే ఉమ్మడి ప్లాట్‌ఫామ్ అవసరమని పేర్కొన్నారు. మూలధనం, కార్మిక శక్తి, సాంకేతికత కోసం బ్రిక్స్ దేశాలు స్వతంత్ర మార్గాలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు.

**మిత్రదేశాలకూ వేదికలో అవకాశం**

ఈ ఆర్థిక వేదిక బ్రిక్స్ సభ్యదేశాలకే పరిమితం కాకుండా స్నేహపూర్వక సంబంధాలు కలిగిన ఇతర దేశాలకు కూడా అందుబాటులో ఉండాలని పుతిన్ సూచించారు. ఇప్పటికే న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ 140 బిలియన్ డాలర్ల విలువైన ప్రాజెక్టులను నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఆర్థిక సహకారం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను కేవలం వాటి లక్షణాల ఆధారంగా కాకుండా, వాటి మూల కారణాలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సంప్రదాయ, సంప్రదాయేతర భద్రతా ముప్పులను ఎదుర్కొనేందుకు గ్లోబల్ సౌత్ దేశాలు కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు.

**పెరుగుతున్న బ్రిక్స్ ప్రభావం**

స్వతంత్ర ఆర్థిక, రాజకీయ మార్గాన్ని ఎంచుకుంటున్న బ్రిక్స్‌పై ప్రపంచ దేశాల ఆసక్తి పెరుగుతోందని పుతిన్ పేర్కొన్నారు. 11 సభ్యదేశాలతో విస్తరించిన ఈ కూటమి ప్రపంచ జనాభాలో సుమారు 49.5 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 26 శాతం వాటాను కలిగి ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ధాన్యం, బీమా, వాణిజ్యం వంటి రంగాల్లో ప్రత్యామ్నాయ వ్యవస్థల నిర్మాణం బ్రిక్స్ భవిష్యత్ ఆర్థిక వ్యూహంలో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది.



## క్వార్ట్జ్ మైనింగ్ పేరుతో వేమిరెడ్డిపై అనిల్ దాడి

అనిల్ కుమార్ అసలు యుద్ధాన్ని ఎక్కడ మొదలుపెట్టారు? మైనింగ్ దగ్గర. ఆగస్టు చివరి నుంచి సెప్టెంబర్ మొదటి వారంలో ఆయన వరుసగా క్వార్ట్జ్ మైనింగ్ వ్యవహారాలను తెరపైకి తెచ్చారు. చైనా వ్యాపారుల ప్రమేయం, "డా" అనే వ్యక్తి పాత్ర, మైనింగ్ లీజులు, క్వార్ట్జ్ సిండికేట్, స్థానిక వ్యాపారులకు ఎదురైన ఇబ్బందులు వంటి అంశాలను ప్రస్తావి స్తూ వేమిరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక మీడియా సమావేశంలో వేమిరెడ్డి లెటర్ హెడ్‌పై ఉన్నట్లు పేర్కొన్న వీసా లేఖ, పాస్‌పోర్ట్ కాపీని కూడా చూపించినట్లు వార్తలు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ అధికారిక ప్రకటనల్లోనూ అనిల్ ఈ ఆరోపణలకు ఆధారాలున్నాయని పేర్కొన్నట్లు నమోదైంది. అయితే రాజకీయ ఆరోపణ అంటేనే అది నిరూపితమైన నేరం కాదు. ఇదే విషయంలో జాగ్రత్త అవసరం.



మైనింగ్‌లో అవకతవకలు జరిగాయా? సిండికేట్ ఉందా? విదేశీ వ్యాపారుల ప్రయోజనాలు ఎలా ఉన్నా యి? ఎవరికి ఎలాంటి లీజులు ఉన్నాయి? ప్రభుత్వానికి ఎంత ఆదా యం వచ్చింది? ఎవరైనా అక్రమంగా లబ్ధి పొందారా? ఇవన్నీ పత్రాలు, దర్యాప్తు, అధికారిక రికార్డులతోనే తేలాలి. ప్రస్తుతం రాజకీయ వేదికపై వినిపిస్తున్నది ప్రధానంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు. కానీ ఈ ఆరోపణలు వరుసగా వస్తున్నందున ప్రభుత్వం వాటిపై పారదర్శక విచారణ చేస్తే రాజకీయంగా ఎవరి బలం ఎంత, ఎవరి మాట ఎంత అన్నది బయటపడుతుంది.

## టీడీపీ ఎదురుదాడితో వేడెక్కిన రాజకీయాలు

ఇదే సమయంలో అనిల్‌పై టీడీపీ నేతలు కూడా ఎదురుదాడికి దిగారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సెప్టెంబర్ 9న అనిల్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. అంటే వ్యవహారం ఇక వైఎస్సార్‌సీపీ-వేమిరెడ్డి కుటుంబం మధ్య మాత్రమే లేదు. అధికార పార్టీ స్థానిక నాయకత్వం కూడా రంగంలోకి వచ్చింది. ఒక వైపు వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కు మద్దతు ఇస్తుంటే.. మరో వైపు టీడీపీ నేతలు వేమిరెడ్డి దంపతుల తరఫున నిలుస్తున్నారు.



కోవూరు ఒక నియోజకవర్గం మాత్రమే అయినా.. దాని రాజకీయ ప్రకంపనలు మొత్తం నెల్లూరు జిల్లాకు విస్తరిస్తున్నాయి. ఇక్కడ మరో కీలకమైన విషయం ఉంది. అనిల్ కుమార్‌కు నెల్లూరులో మళ్లీ రాజకీయ స్థలం కావాలి. 2024 ఎన్నికల తర్వాత ఆయన రాజకీయ ప్రయాణం నెల్లూరు సరిహద్దులను దాటి నరసరావుపేట వైపు వెళ్లింది. ఇప్పుడు మళ్లీ నెల్లూరు రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నారు. అలాంటి సమయంలో వేమిరెడ్డి కుటుం బంపై దాడి చేయడం కేవలం విమర్శగా చూడాలా? లేక తన రాజకీయ ఉనికిని పునర్నిర్మించుకునే ప్రయత్నంగా చూడాలా? ఈ ప్రశ్నకు రాజకీయ వర్గాల్లో రెండో సమాధానమే ఎక్కువగా వినిపిస్తోంది. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేస్తే అది వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌కు కూడా రాజకీయ సందేశమే అవుతుంది. "నేను ఇంకా పోరాటంలోనే ఉన్నాను" అనే సంకేతాన్ని ఇవ్వాలన్న ప్రయత్నం కూడా ఇందులో ఉండవచ్చు.

## ప్రశాంతిరెడ్డి కౌంటర్‌తో వేమిరెడ్డి వ్యూహం ఫలించిందా?

ఇక్కడ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వ్యూహం ఏంటి అన్నది ఆసక్తికరం. ఆయన ప్రతి ఆరోపణకు తానే స్వయంగా సమాధానం ఇవ్వడం కంటే.. ప్రత్యర్థి మాటలను ప్రత్యర్థి వర్గానికే తిరిగి తగిలేలా చేయడం రాజకీయంగా మరింత ప్రయోజనకరం కావచ్చు. ప్రశాంతిరెడ్డి కౌంటర్ అందుకు ఉదాహరణ. అనిల్ మైనింగ్‌పై దాడి చేస్తే ఆమె వ్యక్తిగత రాజకీయ చరిత్రను తెరపైకి తీసుకొచ్చారు. ఇది రాజకీయంగా ఒక రకమైన "కౌంటర్ అటాక్". అందుకే అనిల్ ప్రసన్నతో వేమిరెడ్డిని ఇరుకున పెట్టాలనుకుంటే.. వేమిరెడ్డి ఒక ప్రశాంతిరెడ్డితోనే ఇద్దరినీ డిఫెన్స్‌లోకి నెట్టారా? అనే ప్రశ్న ఇప్పుడు నెల్లూరులో వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల కోణాన్ని విస్మరించలేం. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల స్థాయిలో పార్టీ బలం ఎవరిది అన్నది రాబోయే రాజకీయ సమీకరణలకు కీలకం. అధికార పార్టీ ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఉత్సాహం ఇవ్వడం అనిల్ వ్యూహం కావచ్చు. అదే సమయంలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ప్రత్యర్థుల దాడిని తిప్పికొట్టడం రాజకీయంగా తప్పనిసరి. అందుకే మాటకు మాట.. ఆరోపణకు ఆరోపణ.. సభకు ప్రెస్‌మీట్.. ప్రెస్‌మీట్‌కు కౌంటర్.. ఇదే ఇప్పుడు కోవూరు రాజకీయాల నడక.

## అనిల్-ప్రసన్నపై వేమిరెడ్డి ముప్పేట దాడి

అయితే వేమిరెడ్డి కుటుంబం కూడా రాజకీయంగా వెనక్కి తగ్గే పరిస్థితిలో కనిపించడం లేదు. అనిల్ మైనింగ్ ఆరోపణలు చేస్తే.. ప్రశాంతిరెడ్డి వ్యక్తిగతంగా కౌంటర్ ఇస్తున్నారు. గత పరిచయాలు, గత రాజకీయ సంబంధాలు, గత సహాయాలు, పాత వ్యవహారాలు అన్నీ బయటకు వస్తున్నాయి. అంటే ఇది ఇప్పుడు మైనింగ్ వర్సెస్ మైనింగ్ పోరాటం కాదు. ఇది గతం వర్సెస్ వర్తమానం పోరాటంగా మారింది. ఒకరు "వేమిరెడ్డి ఏం చేశారు?" అని అడుగుతున్నారు. మరొకరు "నువ్వు మంత్రిగా ఉన్నప్పుడు ఏం చేశావు?" అని తిరిగి ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి రాజకీయ యుద్ధంలో అసలు ప్రజా సమస్య వెనక్కి వెళ్లిపోవడం మాత్రం ప్రమాదకరం. మరో ఆసక్తికరమైన కోణం ప్రసన్నకుమార్‌రెడ్డి. 2025లో ప్రశాంతిరెడ్డిపై వ్యాఖ్యల వ్యవహారంలో ఆయనపై కేసు నమోదవడం కోవూరు రాజకీయాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఇప్పుడు అదే రాజకీయ వాతావరణంలో అనిల్ కూడా ప్రశాంతిరెడ్డిపై దాడి చేయడం యాదృచ్ఛికంగా కనిపించడం లేదు. అందుకే "అనిల్--ప్రసన్న కాంబినేషన్" అనే రాజకీయ చర్చ మొదలైంది. అయితే దీనిని అధికారిక సమన్వయంగా చెప్పడానికి ఆధారాలు లేవు. కానీ ఇద్దరూ ఒకే రాజకీయ లక్ష్యాన్ని వేమిరెడ్డి కుటుంబ ప్రభావాన్ని ఎదుర్కోవడాన్ని తమ తమ మాటల్లో ముందుకు తీసుకెళ్తున్నారన్న అభిప్రాయం మాత్రం బలపడుతోంది.

# నెల్లూరు పెద్దారెడ్డి కాదు.. పెద్దమ్మ



**అనిల్-ప్రసన్నతో సింహపురి శివంగి ఆట**

**రాజుకుంటున్న వేమిరెడ్డి మైనింగ్ మంటలు**

**నాకౌట్ పాలిటిక్స్‌లో విజేత ఎవరు?**

**నెల్లూరు పెద్దారెడ్డి కాదు.. పెద్దమ్మ**

**అనిల్-ప్రసన్నతో సింహపురి శివంగి ఆట**

**రాజుకుంటున్న వేమిరెడ్డి మైనింగ్ మంటలు**

**నాకౌట్ పాలిటిక్స్‌లో విజేత ఎవరు?**

నెల్లూరు రాజకీయాల్లో ఇప్పుడు మాటల యుద్ధం కాదు.. మంటల యుద్ధం నడుస్తోంది. ఒకవైపు మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్. మరోవైపు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి. మధ్యలో అధికార టీడీపీకి చెందిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి. ఆమె వెనుక ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఈ నాలుగు పేర్లు నెల్లూరు రాజకీయ రంగస్థలంపైకి వచ్చిన ప్రతిసారీ చర్చ ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి మారడం లేదు.. ఏకంగా రాజకీయ అజెండానే మారిపోతోంది. మొదట వ్యక్తిగత విమర్శలు. ఆ తర్వాత మైనింగ్ ఆరోపణలు. దానికి కౌంటర్లు. మళ్లీ పాత కేసుల ప్రస్తావన. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల వేడి. చూస్తుంటే నెల్లూరులో రాజకీయాలు నాకౌట్ మ్యాచ్‌లా మారిపోయాయి. ఒకరు బంతి వేస్తే మరొకరు బ్యాట్‌తో కొడుతున్నారు. కానీ ఈ మ్యాచ్‌లో అసలు ప్రశ్న మాత్రం వేరే ఉంది. ఎవరిని రాజకీయంగా కట్టడి చేయడానికి ఎవరు ఎవరిపై దాడి చేస్తున్నారు? సెప్టెంబర్ 9న కోవూరులో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన స్థానిక సంస్థల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఈ కొత్త ఎపిసోడ్‌కు వేదికైంది. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అక్కడ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధానంగా క్వార్ట్జ్ మైనింగ్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చారు. మైనింగ్ రంగంలో గుత్తాధిపత్యం, సిండికేట్, వ్యాపార ప్రయోజనాలు వంటి ఆరోపణలు చేశారు. అంతటితో ఆగకుండా ప్రశాంతిరెడ్డి వ్యక్తిగత రూపాన్ని ప్రస్తావిస్తూ, ఆమె కొప్పుపై కూడా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు వెలువడ్డాయి. అదే ఇప్పుడు అసలు రాజకీయ బాంబుగా మారింది. ఎందుకంటే రాజకీయ ప్రత్యర్థిపై విధానపరమైన విమర్శలు ఒక ఎత్తు. మైనింగ్ వ్యవహారాలపై ఆరోపణలు మరో ఎత్తు. కానీ ఒక మహిళా ప్రజాప్రతినిధి వ్యక్తిగత రూపాన్ని టార్గెట్ చేయడం మరో ఎత్తు. అక్కడే విమర్శకు, వ్యక్తిగత దూషణకు మధ్య ఉన్న గీత తెగిపోతుంది. ఆ గీత దాటితే రాజకీయంగా దెబ్బ కొట్టాలనుకున్న వ్యక్తికే ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది.



### మైనింగ్ విమర్శలకు ప్రశాంతిరెడ్డి కౌంటర్

ఇక్కడే ప్రశాంతిరెడ్డి రాజకీయంగా మరో కార్డు బయటకు తీశారు. సెప్టెంబర్ 10న అనిల్ కుమార్‌పై ఆమె చేసిన కౌంటర్ సాధారణ ఖండన కాదు. "మంత్రి పదవి పోయాక మతి భ్రమించిందా?" అంటూ నేరుగా వ్యక్తిగత రాజకీయ చరిత్రను బయటకు లాగారు. గతంలో సాయం కోసం వేమిరెడ్డి దగ్గరకు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రిగా ఉన్న కాలంలో దందాలు చేశారంటూ ఆరోపణలు చేశారు. క్వార్ట్జ్ వ్యాపారుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేశారన్న తీవ్ర ఆరోపణలు కూడా చేశారు. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది సంబంధిత దర్యాప్తు సంస్థలు, ఆధారాలు తేల్చాల్సిన విషయం. కానీ రాజకీయంగా మాత్రం ఆమె ఒక్క మాటతో చర్చ దిశను మార్చేశారు. అనిల్ వేమిరెడ్డిని టార్గెట్ చేస్తే.. ప్రశాంతిరెడ్డి అనిల్ గతాన్నే టార్గెట్ చేశారు. అంటే బంతి మైనింగ్ కోర్టులో పడితే.. బ్యాట్ పాత రాజకీయ ఖాతాలపై పడింది. అసలు ఈ గొడవ నిన్న మొదలైంది కాదు. 2025 నుంచే కోవూరులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వర్సెస్ వైఎస్సార్‌సీపీ నేతల ఎపిసోడ్ మంటలు రేపుతోంది. అప్పట్లో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశాంతిరెడ్డిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కూడా నమోదైంది. అదే వ్యవహారంలో అనిల్ కుమార్ పేరు కూడా తెరపైకి వచ్చింది. 2025 జూలైలో కోవూరు పోలీసులు అనిల్‌కు విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేశారు. ఆయన ఇంటికి వెళ్లిన పోలీసులు అక్కడ ఆయన లేకపోవడంతో నోటీసును గేటుకు అంటించారు. తరువాత విచారణకు హాజరుకాకపోవడానికి హైకోర్టులో క్వాష్ పిటిషన్ పెండింగ్‌లో ఉందని ఆయన తరఫు న్యాయవాదులు పేర్కొన్నట్లు అప్పటి వార్తలు వచ్చాయి.

### నెల్లూరు పెద్దమ్మగా ప్రశాంతిరెడ్డి కొత్త ఎత్తుగడ

అంటే.. కోవూరు రాజకీయాల్లో ప్రశాంతిరెడ్డిపై విమర్శలు చేయడం కొత్త ప్రయోగం కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. అప్పట్లో ప్రసన్నకుమార్‌రెడ్డి ముందుండగా.. ఇప్పుడు అనిల్ కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. ఇది యాదృచ్ఛికమా? లేక వ్యూహమా? వైఎస్సార్‌సీపీకి కోవూరులో రాజకీయంగా తిరిగి బలం తెచ్చుకోవాలంటే అధికార ఎమ్మెల్యేను టార్గెట్ చేయడం సహజ రాజకీయ వ్యూహమే. అయితే ప్రశాంతిరెడ్డి ఒక్క ఎమ్మెల్యే కాదు. ఆమె వెనుక వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. నెల్లూరు రాజకీయాల్లో వేమిరెడ్డి కుటుంబానికి ఉన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిధి తెలిసిందే. అందుకే ప్రశాంతిరెడ్డిపై దాడి చేస్తే దాని ప్రతిస్పందన వేమిరెడ్డి నుంచి కూడా వస్తుందనే విషయం ప్రత్యర్థులకు తెలియనిది కాదు. ఇక్కడే "నెల్లూరు పెద్దమ్మ" అనే రాజకీయ ప్రతీక ఆసక్తికరంగా మారుతోంది. అనిల్ కుమార్ తాజా వివరణలో ప్రశాంతమ్మను "రాజమాత"గా సంబోధించానని, అది తప్పుగా అనిపిస్తే తన తల్లి వయసున్నందున "పెద్దమ్మ" అని పిలవడంలో తప్పేముందని అన్నారు. తాను మహిళలను ఎప్పుడూ అగౌరవపరచలేదని కూడా స్పష్టం చేశారు. కానీ రాజకీయాల్లో పదం ఒక్కటే ముఖ్యం కాదు.. దాని వెనుక ఉన్న సందర్భం ముఖ్యం. సభలో ఏమన్నారు? ఏ సందర్భంలో అన్నారు? ఏ పదాన్ని ఎలా ఉపయోగించారు? దాని వల్ల ప్రత్యర్థికి ఏ అర్థం వచ్చింది? ఇవన్నీ కలిసి రాజకీయ అర్థాన్ని తయారు చేస్తాయి. అందుకే ఇప్పుడు "పెద్దమ్మ" అనే పదం కూడా నెల్లూరు రాజకీయాల్లో ఒక వ్యంగ్య రాజకీయ బ్రాండ్‌గా మారుతోంది.

### 2029కి సిద్ధమవుతోన్న రాజకీయ రణం

కానీ ఒక ప్రశ్న మాత్రం తప్పదు. నెల్లూరు రాజకీయాలను వ్యక్తిగత దూషణల స్థాయికి తీసుకెళ్లడం ఎవరికి లాభం? మైనింగ్‌లో నిజంగా అక్రమాలు ఉంటే వాటిని బయటపెట్టాలి. ఆధారాలు ఉంటే దర్యాప్తు సంస్థలకు ఇవ్వాలి. ప్రభుత్వానికి నష్టం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. రాజకీయ నాయకుడైనా, వ్యాపారవేత్తైనా, అధికార పార్టీకి చెందినవాడైనా, ప్రతిపక్షానికి చెందినవాడైనా చట్టం ముందు ఒకే విధంగా ఉండాలి. అదే ప్రజాస్వామ్య రాజకీయానికి కనీస ప్రమాణం. కానీ మైనింగ్ ఆరోపణలతో మొదలైన పోరాటం ఒక మహిళా ప్రజాప్రతినిధి వ్యక్తిగత రూపంపై వ్యాఖ్యల వరకూ వెళ్లితే.. అసలు సమస్యపై చర్చ పక్కదారి పట్టినట్టే. నెల్లూరు రాజకీయాల్లో మరో విషయం స్పష్టమవుతోంది. ఇది ఒక్కరోజు గొడవ కాదు. ఇది 2029కు ముందస్తు పొజిషనింగ్. ఎవరు ఎక్కడ నిలబడాలి? ఎవరి వెనుక ఎవరు ఉన్నారు? ఎవరి మాటకు జిల్లాలో ఎంత ప్రభావం ఉంది? ఎవరు ఎవరిని లక్ష్యంగా చేసుకుంటే ఎవరి ఓటు బ్యాంకు కదులుతుంది? ఈ లెక్కలన్నీ ఇప్పటి నుంచే మొదలయ్యాయి. అందుకే ప్రతి ప్రెస్‌మీట్ వెనుక ఒక రాజకీయ లెక్క ఉంది. ప్రతి ఆరోపణ వెనుక ఒక రాజకీయ లక్ష్యం ఉంది. ప్రతి కౌంటర్ వెనుక ఒక భవిష్యత్ సమీకరణ ఉంది.

### నాకౌట్ పాలిటిక్స్‌లో సింహపురి శివంగి

వేమిరెడ్డి దంపతులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా వైఎస్సార్‌సీపీ నెల్లూరులో తిరిగి తన రాజకీయ స్థలాన్ని విస్తరించుకోవాలని చూస్తుందా? లేక వేమిరెడ్డి కుటుంబం ఎదుగుదలను అడ్డుకోవడమే ప్రధాన లక్ష్యమా? అనిల్ కుమార్ నిజంగా మైనింగ్ వ్యవహారాల్లో పారదర్శక దర్యాప్తు కోరుతున్నారా? లేక దాని ద్వారా నెల్లూరు రాజకీయాల్లో తన పునరాగమనానికి వేదిక తయారు చేసుకుంటున్నారా? ప్రశాంతిరెడ్డి వ్యక్తిగత కౌంటర్‌తో ఈ పోరాటం మరింత తీవ్రమవు తుందా? ప్రసన్నకుమార్‌రెడ్డి మళ్లీ ముందుకు వస్తారా? ఇవన్నీ రాబోయే రోజుల్లో తేలాల్సిన ప్రశ్నలు. ఒకటి మాత్రం ఖాయం. నెల్లూరులో రాజకీయ మ్యాచ్ ఇంకా ముగియలేదు. అనిల్ బంతి వేశారు. ప్రసన్న ఇప్పటికే ఒకసారి బంతి విసిరారు. వేమిరెడ్డి వర్గం బ్యాటింగ్ మొదలుపెట్టింది. ప్రశాంతిరెడ్డి క్రీజులోకి వచ్చి తొలి షాట్ కొట్టారు. ఇప్పుడు ప్రతిపక్షం మళ్లీ ఏ బంతి వేస్తుందో చూడాలి. మైనింగ్ బంతా? వ్యక్తిగత విమర్శల బంతా? పాత కేసుల బంతా? లేక కొత్త ఆరోపణల బంతా? ఏది వచ్చినా.. వేమిరెడ్డి వర్గం వెనక్కి తగ్గే సంకేతాలు కనిపించడం లేదు. అందుకే నెల్లూరు రాజకీయాలకు ఇప్పుడు సరిపోయే ఒక్క మాట.. నాటౌట్ పాలిటిక్స్. స్కోర్‌బోర్డుపై ఎవరెన్ని పరుగులు చేశారన్నది ఇప్పుడే చెప్పలేం. కానీ ఆట మాత్రం ఆగడం లేదు. మైనింగ్ ఆరోపణల నుంచి మొదలైన పోరు.. వ్యక్తిగత విమర్శల దాకా వచ్చింది. అక్కడి నుంచి పాత రాజకీయ ఖాతాలు తెరుచుకున్నాయి. ఇక తదుపరి ఇన్నింగ్స్‌లో ఎవరి దగ్గర ఏ ఆధారం ఉందో, ఎవరి దగ్గర ఏ సమాధానం ఉందో బయటపడాల్సిందే. అప్పటివరకు నెల్లూరు రాజకీయాల్లో ఒక మాట మాత్రం గట్టిగా వినిపిస్తోంది. ప్రశాంతిరెడ్డి కాదు.. సింహపురి శివంగి వచ్చింది! ఒక్కొక్కరికి మనశ్శాంతి లేకుండా చేసేంతగా ఈ రాజకీయ ఆట మరింత వేడెక్కబోతోందా? సమాధానం రాబోయే రోజుల్లో తెలుస్తుంది. కానీ ప్రస్తుతానికి మాత్రం అనిల్-ప్రసన్నల దాడి వేమిరెడ్డి కుటుంబాన్ని వెనక్కి నెట్టడం కంటే.. నెల్లూరు రాజకీయాల మధ్యలోకే మరింత బలంగా తీసుకొచ్చినట్టే కనిపిస్తోంది.





# అభిషేక్ విధ్వంసం

## తేలిపోయిన ఆఫ్ఘన్.. తొలి టీ20 టీమిండియాదే

**ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపులో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిన తీరు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.**

కేవలం 32 బంతుల్లోనే 7 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 82 పరుగులు చేసి, ఆఫ్ఘన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని విధ్వంసకర ఇన్నింగ్స్‌తో భారత్ లక్ష్యాన్ని మరో 38 బంతులు మిగిలి ఉండగానే సునాయాసంగా ఛేదించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్, ఆఫ్ఘనిస్థాన్‌ను ఓ మోస్తరు స్కోరుకే పరిమితం చేసింది.

అనంతరం 157 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ సంజూ శాంసన్ (10) తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. అయితే, మరో ఎండ్ లో అభిషేక్ శర్మ, ఆఫ్ఘన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. మొదటి నుంచి దూకుడు మంత్రాన్ని జపించి, బౌలర్ ఎవరనేది చూడకుండా బౌండరీల వర్షం కురిపించాడు. ముఖ్యంగా భారత ఇన్నింగ్స్‌లో పవర్‌ప్లేలో అభిషేక్ ఆడిన తీరు మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. అతని ధాటికి పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 82 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ ప్రధాన బౌలర్లైన ఫజల్‌హక్ ఫరూఖీ, రషీద్ ఖాన్‌లను కూడా లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడాడు. అతని బ్యాటింగ్ చూసి ఆఫ్ఘన్ కెప్టెన్ నిస్సహాయంగా చూడటం తప్ప ఏమీ చేయలేకపోయాడు. 256.25 స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధించి, టీ20 క్రికెట్‌లో అసలైన విధ్వంసం ఎలా ఉంటుందో చూపించాడు. మరో ఎండ్‌లో ఉన్న ఇషాన్ కిషన్ (33 బంతుల్లో 42) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు కేవలం 53 బంతుల్లోనే 121 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యంలో అభిషేక్ పూర్తి ఆధిపత్యం చెలాయించగా, ఇషాన్ నిలకడగా ఆడుతూ అతనికి స్ట్రైక్ రొటేట్ చేశాడు. శతకం దిశగా సాగుతున్నట్టు కనిపించిన అభిషేక్, మహమ్మద్ నబీ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి రషీద్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికే భారత్ విజయం ఖాయమైంది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (8లి), తిలక్ వర్మ (3లి) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. అంతకుముందు టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఆఫ్ఘన్ తీవ్ర కష్టాల్లో పడింది. స్పిన్నర్లు అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి పొదుపుగా బౌలింగ్ చేసి ఒత్తిడి పెంచడంతో అఫ్గాన్ టాప్ ఆర్డర్ చేతులెత్తేసింది. ఒక దశలో 43 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కుప్పకూలిన ఆ జట్టు, ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (64 నాటౌట్) వీరోచిత అర్ధశతకంతో పుంజుకుంది. ఫలితంగా, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 19 పరుగులకే 3 వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఇక, ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ సెప్టెంబరు 15న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలోనే జరగనుంది.





# అమ్మాయిలా మజాకా..!

## ఆసియా కప్ పట్టేశారు!.. శ్రీలంకపై ఘన విజయం

### శ్రీచరణి స్పిన్ మ్యాజిక్.. షఫాలీ, స్మృతి మంధనల మెరుపులు

మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్లో భారత జట్టు అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. దుబాయ్ వేదికగా జరిగిన తుది పోరులో శ్రీలంకను 72 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి రికార్డు స్థాయిలో 8వ సారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (68), స్మృతి మంధన (59) బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టిస్తే, యువ బౌలర్ శ్రీ చరణి (4/20) బంతితో మాయ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.

**భారత అమ్మాయిల జోరు ముందు లంక జట్టు పోటీ ఇవ్వలేకపోయింది. 184 పరుగుల లక్ష్యఛేదనలో 111 పరుగులకే ఆలౌట్ అయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు.**

లంక బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 12.5 ఓవర్లలోనే 129 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోరుకు బలమైన పునాది వేశారు. షఫాలీ 39 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 68 పరుగులు చేయగా, స్మృతి 39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59 పరుగులు సాధించింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు వేగంగా ఆడటంలో కాస్త తడబడినప్పటికీ, చివర్లో కమలిని కేవలం 5 బంతుల్లోనే ఓ ఫోర్, సిక్సర్‌తో 15 పరుగులు చేసింది. దీంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 184 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి దెబ్బ తగిలింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు లంక బ్యాటర్లు పరుగులు చేయడానికి



తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కెప్టెన్ చమరి అటపట్టు (36) కాసేపు పోరాడినా, ఆమె ఔటయ్యాక లంక పతనం వేగవంతమైంది. ముఖ్యంగా, యువ స్పిన్నర్ శ్రీ చరణి తన అద్భుత బౌలింగ్‌తో లంక బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చింది. కీలకమైన హర్షిత, నీలాక్షిక, కవిష, సుగందికల వికెట్లను పడగొట్టి లంకను కోలుకోలేని దెబ్బ తీసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టిన శ్రీ చరణికి, 3 వికెట్లు తీసిన దీప్తి శర్మ చక్కటి సహకారం అందించింది. దీంతో శ్రీలంక జట్టు సరిగ్గా 20 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు ఆసియా కప్‌ను గర్వంగా ముద్దాడింది. టీమిండియా మహిళల జట్టు ఇప్పటివరకు మొత్తం 8 సార్లు ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకుంది. అందులో వన్డే ఫార్మాట్ లో 4 సార్లు, టీ20 ఫార్మాట్ లో 4 సార్లు టైటిల్ గెలిచింది.

## నాపై జాలి చూపిస్తే నచ్చదు



భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మందాన తన క్రికెట్ కెరీర్‌లోని అత్యంత కఠినమైన రోజులు.. వ్యక్తిగత ఎమోషనల్ లైఫ్ జర్నీ గురించి తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసారు. పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో హార్డెస్ట్ డేస్ గురించి ప్రశ్నించగా స్మృతి రియాక్షన్ ఆసక్తిని కలిగించింది. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా రాణిస్తున్న ఈ మహిళా క్రికెటర్ తన కెరీర్‌లో ఎదురైన ఇబ్బందికర క్షణాలు, విమర్శలు.. తన లైఫ్ రూల్స్ గురించి ఓపెన్‌గా ఈ పాడ్ కాస్ట్ లో మాట్లాడారు. మైదానంలో ఎంత దూకుడుగా ఉంటారో... వ్యక్తిగత జీవితంలోనూ అంతే ఆత్మవిశ్వాసంతో ఉంటానని స్పష్టం చేశారు. తాను తీవ్రమైన బాధలో ఉన్నప్పుడు ఎవరికీ కనిపించకుండా ఒంటరిగా గడపడానికి ఇష్టపడతానని.. కానీ ఇతరుల నుంచి వచ్చే జాలిని మాత్రం ఏమాత్రం సహించలేనని స్మృతి పేర్కొన్నారు. --నాకు సింపతీ (సహానుభూతి-జాలి) అంటే అసహ్యం. ఎవరైనా వచ్చి --ఓహ్, నువ్వు ఔట్ అయ్యావా?-- అంటూ జాలిగా చూడటం నాకు నచ్చదు. నన్ను ఎప్పుడూ ఒక -బేచారి- (అబల)లా చూడకండి.. నేను చాలా స్ట్రాంగ్-- అని ఆమె బోల్డ్‌గా చెప్పారు. తనలోని బాధను ఎవరి ముందూ ప్రదర్శించడానికి ఇష్టపడనని.. అందరూ తనను ఒక సంతోషకరమైన వ్యక్తిలాగే చూడాలని కోరుకున్నారు. తన వ్యక్తిగత విషయాలు , కుటుంబ నేపథ్యం గురించి ఇంటర్వ్యూలలో ఎందుకు మాట్లాడరనే దానిపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. తన కష్టాల గురించి చెప్పి ఇతరుల నుంచి సానుభూతి పొందాలని తాను ఎప్పుడూ కోరుకోలేదని స్మృతి తెలిపారు.

## బాక్స్ బయటి నుంచి మెస్సీ గోల్

మేజర్ లీగ్ సాకర్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ మరోసారి తన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. నాష్‌విల్లే ఎస్సీతో జరిగిన మ్యాచ్‌లో పెనాల్టీ బాక్స్ బయటి నుంచి అద్భుతమైన గోల్ కొట్టి తన జట్టు ఇంటర్ మయామిని ఆధిక్యంలో నిలిపాడు. అయినప్పటికీ, ఈ మ్యాచ్‌లో మయామికి విజయం దక్కలేదు. ఆఖరి నిమిషంలో నాష్‌విల్లే గోల్ చేయడంతో మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది. నిన్న జరిగిన ఈ మ్యాచ్ ఆరంభంలోనే నాష్‌విల్లే దూకుడు కనబరిచింది. ఆట మొదలైన నాలుగో నిమిషంలోనే సామ్ సరిడ్జ్ గోల్ చేసి నాష్‌విల్లేకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, ఇంటర్ మయామి వెంటనే తేరుకుంది. 19వ నిమిషంలో మెస్సీ కొట్టిన కార్నర్ కిక్‌ను అడ్డుకోబోయిన నాష్‌విల్లే డిఫెండర్ రీడ్ బేకర్-వైటింగ్, పొరపాటున బంతిని తమ సొంత గోల్ పోస్టులోకి పంపడంతో స్కోరు 1-1తో సమమైంది. రెండో అర్ధభాగంలో మెస్సీ తన మార్క్ ఆటతో అభిమానులను ఉర్రూతలూగించాడు. 62వ నిమిషంలో సహచర ఆటగాడు రోడ్రిగో డి పాల్ నుంచి పాస్ అందుకున్న మెస్సీ, పెనాల్టీ ఏరియా బయటి నుంచి తన ఎడమ కాలితో కొట్టిన అద్భుతమైన షాట్ నేరుగా గోల్ నెట్‌లోకి దూసుకెళ్లింది. ఈ గోల్‌తో ఇంటర్ మయామి 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ సీజన్‌లో మెస్సీకి ఇది 19వ గోల్ కాగా, టాప్ స్కోరర్‌గా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. 2023లో మయామి జట్టులో చేరినప్పటి నుంచి నాష్‌విల్లేపై ఆడిన 14 మ్యాచ్‌లలో మెస్సీకి ఇది 17వ గోల్ కావడం గమనార్హం. మ్యాచ్ మయామి గెలుస్తుందని అంతా భావిస్తున్న తరుణంలో నాష్‌విల్లే అనూహ్యంగా పుంజుకుంది. ఇంజురీ టైమ్‌లో సామ్ సరిడ్జ్ మరోసారి గోల్ చేసి స్కోరును 2-2తో సమం చేశాడు. దీంతో గెలుపు అంచుల వరకు వచ్చి మయామి డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.



## మోదీజీ.. హ్యాట్సాఫ్: రవిశాస్త్రి



భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్, ప్రముఖ వ్యాఖ్యాత రవిశాస్త్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ ప్రదర్శిస్తున్న అంతర్జాతీయ దౌత్యనీతిని కొనియాడాడు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ ఆసక్తికర పోస్ట్ చేశాడు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో కలిసి ప్రధాని మోదీ మొక్కలు నాటుతున్న ఫొటోను రవిశాస్త్రి పంచుకున్నాడు. సదస్సు జరుగుతున్న 'భారత్ మండపం'లో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ ఫొటోను షేర్ చేస్తూ.. "ఒక భారతీయుడిగా నేనెప్పుడూ ఇంత గర్వంగా ఫీల్ అవ్వలేదు. అధ్యక్షుడు పుతిన్, అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, మన అద్భుతమైన ప్రధాని నరేంద్ర మోదీ అంతా మాతృభూమి భారత్‌లో ఒకేచోట ఉన్నారు. ఇది మునుపెన్నడూ చూడని అంతర్జాతీయ దౌత్యం. మోదీ జీ.. మీకు నా హ్యాట్సాఫ్" అంటూ తన పోస్టులో పేర్కొన్నాడు. భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో 18వ బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాల అధినేతలు ఇందులో పాల్గొన్నారు. సదస్సులో భాగంగా నిన్న బ్రిక్స్ నేతలు 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'ను ఆమోదించారు.

## అభిషేక్ శర్మ.. 6000

భారత యువ సంచలనం, విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో బంతుల పరంగా అత్యంత వేగంగా 6,000 పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా, ఈ ఘనత సాధించిన మొట్టమొదటి ఆసియా ఆటగాడిగానూ నిలిచాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో అభిషేక్ ఈ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. తన టీ20 కెరీర్‌లో 6,000 పరుగుల మార్కును చేరుకోవడానికి అతడికి కేవలం 3,420 బంతులు మాత్రమే అవసరమయ్యాయి. ఈ జాబితాలో న్యూజిలాండ్‌కు చెందిన విధ్వంసకర ఓపెనర్ ఫిన్ అలెన్ (3,386 బంతులు) మాత్రమే అభిషేక్ కంటే ముందున్నాడు. ఈ క్రమంలో అభిషేక్ శర్మ.. ఆండ్రీ రస్సెల్ (3,550 బంతులు), టిమ్ డేవిడ్ (3,681 బంతులు), విల్ జాక్స్, ఫిల్ సాల్ట్ (3,857 బంతులు) వంటి మేటి హార్డ్ హిట్టర్లను వెనక్కి నెట్టడం విశేషం.

రాజ్య సంస్కరణ
సోమవారం, 14.9.2026, మేడ్చల్ మల్కాజిగిరి

వర్ణ చిత్రం



మంజు వారియర్




# బెత్లహేమ్ కుటుంబ యూనిట్.. 300 కోట్లు

మలయాళీ చిత్రం.. నివిన్ పౌలీ హీరోగా నటించిన -బెత్లహేమ్ కుటుంబ యూనిట్- బాక్సాఫీస్ వద్ద రికార్డులను బద్దలు కొట్టింది. కేవలం 23 రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన వసూళ్లను సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ సినిమాలో ఇటీవల సూర్య సరసన వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న లక్కీ గాళ్ మమితా బైజు కథానాయికగా నటించడం ఈ చిత్రానికి మరింత ప్లస్ అయింది. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మలయాళంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల సరసన నిలిచింది. కేవలం రూ. 30 కోట్ల బడ్జెట్‌తో అత్యంత సాధారణంగా తెరకెక్కిన ఈ చిత్రం.. మౌత్ టాక్‌తో పుంజుకుని ఏకంగా రూ. 300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయికి చేరువ కావడం విశేషం. సెప్టెంబర్ 4న తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా అన్ని భాషల్లోనూ అద్భుతమైన ఆదరణను దక్కించుకుంది. ఈ భారీ విజయం ద్వారా సినీ పరిశ్రమకు ఒక స్పష్టమైన సందేశం లభించిందని చెప్పవచ్చు. పెద్ద పెద్ద స్టార్ హీరోల సినిమాలు.. భారీ మార్కెట్ ఉన్న ఇమేజ్ కంటే బలమైన కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఏ రేంజ్‌లో నెత్తిన పెట్టుకుంటారనేదానికి -బెత్లహేమ్ కుటుంబ యూనిట్- విజయమే నిదర్శనం. కథలో దమ్ముంటే చిన్న బడ్జెట్ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి సునామీ సృష్టించగలదో ఈ చిత్రం నిరూపించింది. సినిమా విడుదలై ఇన్ని రోజులు గడిచినా నైట్ షోలలో ఏకంగా 73.17 శాతం ఆక్యుపెన్సీ నమోదు కావడం దీనికి నిలువెత్తు సాక్ష్యం.

# కంబ్యాక్ ఇచ్చిన హీరోయిన్ తల్లి

సీనియర్ నటి మేనక సురేష్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ మలయాళ చిత్రసీమలోకి పునరాగమనం చేయడం విశేషం. -ఒరు కొరియన్ కన్ఫ్యూజన్- అనే వినూత్న శీర్షికతో తెరకెక్కుతున్న చిత్రం ద్వారా మేనక మాలీవుడ్ లో రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఎనభైల నాటి తరం ప్రేక్షకులను సహజసిద్ధమైన నటనతో అలరించిన మేనక మళ్ళీ వెండితెరపై కనిపించబోతుండటంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మేనక సురేష్ మలయాళ సినీ చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన ముద్రను వేసుకున్నారు. 1980వ దశకంలో



ఎన్నో చిత్రాల్లో నటించి విజయాలు అందుకున్నారు. ఎంతో మంది స్టార్ హీరోలతో తెరను పంచుకున్నారు. అప్పటి తరం ప్రేక్షకులకు మేనక అందించిన పాత్రలు ఇప్పటికీ నటనకు చిరునామాగా నిలిచాయి. కుటుంబ కథా చిత్రాలకు , భావోద్వేగ ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మేనక పెట్టింది పేరుగా ఓ వెలుగు వెలిగారు. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్న సమయంలోనే నిర్మాత జి. సురేష్ కుమార్‌ను వివాహం చేసుకుని అటుపై నటనకు కొంతకాలం విరామం ఇచ్చారు. కుటుంబ బాధ్యతలు నెరవేర్చడం.. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో మేనక ప్రధాన పాత్ర పోషించారు. దీంతో పరిశ్రమకు దూరమయ్యారు. అయినా చిత్ర పరిశ్రమతో ఉన్న అనుబంధం, సినిమాపై ఉన్న మక్కువ ఆమెలో ఎప్పుడూ తగ్గిపోలేదనడానికి ఈ పునరాగమనమే నిదర్శనం. మేనక సురేష్ నటనతో పాటు ఆమె కుటుంబం కూడా మలయాళ సినీ జగత్తులో ఎంతో పేరు సంపాదించింది.

# 'ఫెమినిజం'పై తప్పుడు అభిప్రాయాలు

టాలీవుడ్ యంగ్ బ్యూటీ పాయల్ రాధాకృష్ణ 'హ్యాపీ జర్నీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అభిరామ్ నాయుడు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏడుగురు మహిళలు కలిసి చేసే యూరప్ ట్రిప్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా పూర్తిగా భావోద్వేగభరితంగా సాగుతుంది. అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ తాజాగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో పాయల్ రాధాకృష్ణ మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలోచక్కర్లు కొడుతున్నాయి. సినిమాలో పోస్టర్లు చూసి కేవలం అమ్మాయిల ప్రయాణం మాత్రమే అనుకోవద్దని, కానీ కథ క్లైమాక్స్‌లోకి వెళ్లేసరికి వారి జీవితాల్లోకి అబ్బాయిల ప్రాధాన్యత ఏంటో తెలుస్తుందని ఆమె చెప్పారు. ఫెమినిజం అంటే అబ్బాయిలను వ్యతిరేకించడం కాదని, నేటి సమాజంలో కొందరు దీని అర్థాన్ని పూర్తిగా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని పాయల్ అభిప్రాయపడ్డారు. ఈ సృష్టిలో అమ్మాయి ఉండాలంటే అబ్బాయి ఉండాలని, అలాగే అబ్బాయి ఉండాలంటే అమ్మాయి అవసరం ఉంటుందని, అదే అసలైన జీవిత సౌందర్యమని ఆమె పేర్కొన్నారు.



# నా పోస్టర్లను చెప్పులతో కొట్టారు

'బేబీ' చిత్రంతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించి ఓవర్ నైట్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య ఇటీవల 'ఎపిక్' మూవీతో మరోసారి థియేటర్ల ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను, ముఖ్యంగా 'బేబీ' సినిమా సమయంలో వచ్చిన విపరీతమైన నెగెటివిటీని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. తనకు 'బేబీ' సినిమాతో ఒక్క రాత్రిలో ఎలాంటి సక్సెస్ రాలేదని వైష్ణవి స్పష్టం చేశారు. కవర్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్, పలు చిత్రాల్లో చిన్న చిన్న క్యారెక్టర్ రోల్స్ చేస్తూ ఎంతో కష్టపడి ఇక్కడికి చేరుకున్నానని ఆమె తెలిపారు. అయితే సినిమా విడుదలైన తర్వాత కొందరు తనను ఉద్దేశించి నోటికి వచ్చినట్లు గలీజ్‌గా మాట్లాడారని, థియేటర్ల వద్ద తన పోస్టర్లపై చెప్పులతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఆ దృశ్యాలన్నీ చూశాక ఎంతో బాధపడ్డానని తెలిపారు. సినిమా సూపర్ హిట్ అయిందని సంతోషించాలా? లేక తాను పడిన కష్టానికి ఈ రకమైన అవమానాలే బహుమతిగా వస్తున్నాయని బాధపడాలా? అనే తీవ్రమైన మానసిక వేదనలోకి వెళ్లిపోయానని వైష్ణవి అన్నారు. అయితే కాలం మారుతున్న కొద్దీ ఆ నెగెటివిటీ గురించి పట్టించుకోవడం మానేశానని, కేవలం తన పనిపై, సానుకూల అంశాలపై మాత్రమే దృష్టి పెట్టడం మొదలుపెట్టానని ఆమె వివరించారు.



# నేడు హనుమాన్ అంశ్ టీజర్ రిలీజ్

జాతీయ స్థాయిలో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై, బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. 'హనుమాన్ అంశ్ - ఆంజనేయుడి అవతారం' పేరుతో రానున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను సోమవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెలుగులో సమర్పిస్తుండటం విశేషం. ఆయన సమర్పణలో ఫార్చ్యూన్ 4 సినిమాస్ సంస్థ ఈ సినిమాను సెప్టెంబర్ 18న తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ చిత్రం ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా (మహరాజ్‌జీ) జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కింది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించగా, శోభినవ్ సత్య ప్రధాన పాత్రలో నటించి మెప్పించారు. హిందీలో కేవలం రూ. 2 కోట్ల నామమాత్రపు బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా, అనూహ్యంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.






# జయమ్మ పాత్ర గొప్పది

విజయ్ దేవరకొండ, క్రేజీ బ్యూటీ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంపై టాలీవుడ్‌లో ఇప్పటికే విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పూర్తి భిన్నమైన యోధుడి పాత్రలో కనిపించ నుండగా, రష్మిక మందన్నా 'జయమ్మ' అనే శక్తివంతమైన పాత్రలో అలరించబోతున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధిం చి రష్మిక మందన్నా తన వంతు షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్ షేర్ చేస్తూ సినిమాపై తన అనుభవాలను పంచుకున్నారు. 'రణబాలి' చిత్రంలో జయమ్మగా తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పార్ట్ ముగిసిందని, ఈ జర్నీ తన కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆమె తెలిపారు. జయమ్మ పాత్ర కేవలం ఒక సినిమాలోనిది కాదని, అది ప్రతి ఒక్కరి మనసులను హత్తుకునేలా ఉంటుందని రష్మిక పేర్కొన్నారు. రాబోయే అక్టోబర్ 16న థియేటర్లలో 'రణబాలి' సినిమా చూసినప్పుడు ప్రేక్షకులకు కూడా సరిగ్గా ఇదే భావనలుగుతుందని ఆమె గట్టిగా ఆశిస్తున్నట్లు తెలిపారు.

# అజిత్-విజయ్ ఆత్మీయ కలయిక

బ్రిటన్‌లోని ప్రసిద్ధ సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌లో ఒక అరుదైన.. చారిత్రాత్మక దృశ్యం ఆవిష్కృతమైంది. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సి. జోసెఫ్ విజయ్ అధికారిక పర్యటనలో భాగంగా సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ రేసింగ్‌లో పాల్గొంటున్న అజిత్ కుమార్‌ను విజయ్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న క్షణాలు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారి... కోట్లాది మంది అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 60 ఏళ్ల వయసులోనూ -తళా- అజిత్ అంతర్జాతీయ రేసింగ్‌లో చూపుతున్న తెగువ... సాధిస్తున్న విజయాలు చూసి మాస్ యూత్ ఫ్యాన్స్ ఉప్పొంగుతున్నారు.



This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.